ఆదివారం

ప్రజాశక్తి

నవంబరు 23, 2003

జాతీయసమైక్యతకు ప్రతిరూపం ఎన్‌సిసి



ఎడారిలో బంగారు కోట

హ్యాపీ బర్త్‌డే

(23-11-2003నుండి 29-11-2003వరకు)

ఎ. భాగ్యశ్రీ
6సం॥, 23.11.1997
నాగమణి-ప్రసన్న గణేష్
బొందలవాడ-అనంతపురం



వై.రాశి
నవంబర్-23
కృష్ణవేణి-శివశంకర్‌రెడ్డి
నాగిరెడ్డిపల్లి-అనంతపురం

వి. సాయిశ్రీ
6స॥, నవంబర్-1999
శారద-రాజబాబు
ఉక్కునగరం-విశాఖ

అఖిల
నవంబర్-23
భూలక్ష్మి-బొయినపల్లికొండ

పోన్న పూజ
1సం॥, 23.11.2002
పుష్పలత-నాగరాజు
కట్టంగూర్-నల్లగొండ

రాగమాలిక
3సం॥, 24.11.2000
కుమారి-సత్తిబాబు
నిడదవోలు-ప॥గో॥

పి.శోభన్‌బాబు
2సం॥,24.11.2001
లీలామాధవి-శ్రీనివాసరావు
మంగళగిరి- గుంటూరు



డి.రెడ్డికిషన్
2సం॥, 24.11.2001
వసంత-రఘురాం
సోమల-చిత్తూరు

వైష్ణవిజయ
1సం॥, నవంబర్-2002
సుభాషిణి-సురేష్‌జయ
వల్లభ్‌నగర్-మహబూబ్‌నగర్

ఇ.తరంగ్
2సం॥, నవంబర్-2001
జంగమ్మ-గాలయ్య
మంచాల-రంగారెడ్డి

డి. అంకిత
1సం॥, 26.11.2002
సుజాత-విజయ్‌కుమార్
గొంట్టిపల్లి-విశాఖ

వై. తేజస్స్ యాదవ్
1సం॥, 26.11.2002
సువర్ణ-హరికృష్ణ
డోర్నకల్-వరంగల్

రావెళ్ల ప్రసన్న
3సం॥, 27.11.2000
లక్ష్మి-భాస్కరరావు
వేమూరు-గుంటూరు

పి. గౌరిలావణ్య
4సం॥, 27.11.1999
ఓంప్రకాశ్
కనిగిరి-ప్రకాశం

కె. నిఖిల్
8సం॥, నవంబర్-1995
అరుణ-ఈశ్వర్
హైదరాబాద్



వినయ్‌కుమార్‌రెడ్డి
2సం॥, నవంబర్-2001
అపర్ణమ్మ-అంజిరెడ్డి
మడమనూరు-నెల్లూరు



తేజశ్విని, ఉషశ్విని, హృషికేశ్
3సం॥, 25.11.2000
విశ్వజ్యోతి-విశ్వేశ్వర్
నల్లగొండ

సౌమ్య
నవంబర్
కృష్ణకుమారి-సీతారామయ్య
విశాఖపట్నం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



బండబారుతున్న బాల్యం కదిలించింది

నవంబర్ 9వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన బండబారుతున్న బాల్యం కవర్‌స్టోరీ కదిలించింది. సమాజం విస్మరించిన బాలల గురించి, వారి దీనపరిస్థితుల గురించి వివరించిన తీరు బాగుంది. కార్టూన్లు కూడా ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. చరణ్‌మిత్రగారి ఢమరుకం కథ చాలాబాగుంది. పేదవాడికి మాత్రమే భూమి గుండ్రంగా ఉంటుంది అనే నీతి ఈ కథ ద్వారా తెలుస్తుంది.

వి. రాజా
కృష్ణలంక, విజయవాడ

ఔరా ఆసక్తికరం

ఆదివారం అనుబంధంలో ఇస్తున్న ఔరా శీర్షిక ఆసక్తికరంగా సాగుతోంది. ప్రతివారం కొత్త విషయాలు, ఆశ్చర్యం గొలిపేవి ఇస్తున్నందుకు అభినందనలు. బండబారుతున్న బాల్యం కవర్‌స్టోరీ చట్టాలు అమలుచేయని, సమాజశ్రేయస్సుని పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది. టూరిస్ట్‌గైడ్‌లో ప్రచురించిన గ్రేట్‌వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాలా బాగుంది. మన రాష్ట్రంలో ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాలు మరుగున వడి ఉన్నాయి. అటువంటివాటి గురించి తెలియచెప్పాలని కోరుతున్నాను. న్యాయసలహాలు శీర్షిక ఉపయోగకరంగా ఉంది.

– కె. బాలకృష్ణ, ఖమ్మం

ప్రాణదాతలు ఉత్తేజభరితంగా ఉంది

రియల్‌స్టోరీ శీర్షికన నవంబర్ 9వ తేదీ అనుబంధంలో ప్రచురించిన ప్రాణదాతలు ఉత్తేజం కలిగించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు మానవత్వం లేకుండా వ్యవహరిస్తారనే ప్రచారం ఉంది. అలాగాకుండా రోగికి రక్తం కూడా ఇచ్చి ప్రాణం కాపాడిన జడ్జిఖానా డాక్టర్ల దయాగుణం ఇతర డాక్టర్లకు మార్గదర్శకంగా ఉండగలదు. రుచి శీర్షిక కింద ఇస్తున్న వంటలు బాగుంటున్నాయి.

– సి. బాబూరావు, చిత్తూరు



'డమరుకం' బాగుంది

'డమరుకం' కథ బాగుంది. సమాజం తక్కువగా చూసే బుడబుక్కల వృత్తి చేసుకుని తండ్రి తన పిల్లలు కులవృత్తిని కాకుండా దర్జాగా బతకాలని ఆశించి పట్నంలో చదివించాడు. అక్కడ వారు చేసే పనికి, తమ కులవృత్తికి తేడా లేదని తెలిసి బాధతో విలవిలలాడిన తండ్రి కథ చదివి మేము చలించి పోయాము. ఇంకా నిరుద్యోగ పిల్లల్ని వివిధ రకాలుగా వుపయోగించడం ఈ ప్రభుత్వ పాలనలో ఇలాంటివి ఇలా ఎన్నో. 'బండబారుతున్న బాల్యం' కవర్ స్టోరీ కదిలించివేసింది.

– పి. పద్మావతి,
భ్రమరాంబికానగర్, మెదక్

రచయితలకు మనవి

ఆదివారం అనుబంధంలో ప్రచురణ కొరకు కథలు పంపే రచయితలకు సూచన. కథలు పేజీకి 20 లైన్లకు మించకుండా ఐదు అరరావుల్లో రాయాలి. పేజీకి ఒకవైపునే రాయాలి. ప్రచురణార్థం కాని కథలు తిప్పి పంపగోరువారు తగిన స్టాంపులు అంటించిన కవరు జతపరచాలి. కథలు పంపవలసిన చిరునామా:

సంపాదకులు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫోటోతో పాటు రాసిన వారి ఫోటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా: **రుచి**, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

మనలో మాట

తప్పించుకు తిరుగువాడు...

ఎప్పటికా మాట చెప్పి

తప్పించుకు తిరుగువాడు ధన్యుడు

అన్నాడు సుమతీ శతకకారుడు. ఇది నిజమే నంటారా అంటే కొందరు అవుననీ అనవచ్చు. ఇంకొందరు కాదని అనవచ్చు. తరచి చూస్తే ఇలాంటి వాళ్ళు మనకు చాలా మంది, చాలా సందర్భాల్లో తారస పడుతూనే ఉంటారు. కొన్ని సందర్భాలలో మనల్ని మనమే అనుమానించుకొనే పరిస్థితి కూడా వస్తుంటుంది. మనం కూడా అలా చేస్తున్నామేమోననే అనుమానం కూడా వేధిస్తుంటుంది. ఎందుకంటే లోకాన్ని బట్టి మనమూ పోవాలంటారు కొందరు మహాత్ములు. పోనీండి. అసలు విషయానికొద్దాం.

ఆ మధ్య ఏదో అత్యవసరమైన పనిబడి నా స్నేహితుడు ఒకరిని కలుసుకోవడానికెళ్ళా. ఓ పెద్ద ఆఫీసులో అతనో సెక్షన్ ఆఫీసర్. నేను వెళ్ళేసరికి ఆఫీసులోని కొందరు అక్కడ చేరి ఏదో విషయం మీద తర్జనభర్జనలు పడుతున్నారు.. రాకూడని సమయంలో వచ్చానేమో అనుకున్నా. చర్చ మాత్రం చాలా హాటుహాటుగానే ఉంది. మనకెందుకులే అనుకోలేక పోయా.

మానవ సహజమైన ఉత్సుకత కొద్దీ అసలు విషయమేమిటో తెలుసుకోవాలన్పించింది. వచ్చిన పని పక్కనబెట్టి విషయమేమిటని ఆరా తీశా. మిత్రుడు అసలు కథ బయట పెట్టాడు. వాళ్ళ ఆఫీసులో దాదాపు అన్ని సెక్షన్లకూ ఎంతోకొంత అనుసంధానంగా ఉండే సెక్షనొకటి ఉంది. దానికి కూడా సహజంగానే ఓ హెడ్డు ఉన్నాడు. చర్చంతా ఆయన గురించేనట! అనేక సెక్షన్ల వాళ్ళు తమ తమ అవసరాల రీత్యా ఆ హెడ్డును సంప్రదించాల్సిందేనట! ఆయన ఎవరేది అడిగినా వారిని నొప్పించ కూడదనే థియరీని అనుసరిస్తూ వారిని సంతోషపరిచే పద్ధతి అవలంబిస్తాడట! తీరా ఒకానొక సమయంలో అన్ని సెక్షన్ల ఆఫీసర్లు ఆయన సమాధానాలను బేరీజు వేసుకుంటే ఒకదాని కొకటి పొంతన లేకుండా పోయాయి. అందరి దగ్గరా ముఖ్యంగా తన పై అధికారి దగ్గర మంచి వాడిననిపించుకోవాలనే తాపత్రయంతో ఆయన అలా చెప్పాడని బయటపడింది. అప్పటికి ఆ సమస్య తీరినట్లు కన్పించినా చాలా తక్కువ సమయంలోనే ఆయనపై అందరికీ దురభిప్రాయం మాత్రం ఏర్పడింది.

ఆ హెడ్డుకే మరో అలవాటు కూడా ఉందట. అక్కడ మాటలు ఇక్కడ, ఇక్కడి మాటలు అక్కడా చెప్పడం. అనని మాటలు అన్నట్లు, అన్న మాటలు అననట్లు కూడా చెబుతాడట! ఇది
పాపం ఆయనకున్న మరో బలహీనత.
మనిషికో రకమైన మాటలు చెప్పే ఇలాంటి
ప్రబుద్ధుల విషయంలో జాగ్రత్త
సుమా!

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కనదగు నెవ్వరు గీచిన... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
పుస్తక పరిచయం . . . 20
టూరిస్ట్ గైడ్ . . . 21
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

బాపూ బర్త్‌డే
కథ ... 8



కనిపించని దేవుడు
రియల్‌స్టోరీ . . . 14, 15

అందాన్ని, ఆరోగ్యాన్ని నాశనం చేసే కాలుష్యం
ఆరోగ్యం . . . 18

సెమ్మంగుడి... సంగీతజ్ఞాన పిపాసి
కళాసాహితి . . . 22

బాలల కచేరీ

రైళ్ళలో వికలాంగులు, పిల్లలు పాటలు పాడుకుంటూ యాచించడం అందరికీ అనుభవమే. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో వీరి సంఖ్య మరీ అధికం. అపుడపుడు టిక్కెట్ చెకింగ్ చేసేవారు వీరిని పట్టుకోవడం, జరిమానా వేయడం కూడా మామూలే. ముంబయిలో తిరిగే మెట్రోరైళ్ళలో అనేకమంది పిల్లలు గుంపులుగా తిరుగుతూ హిందీ పాటలు పాడుతారు. వీనుల విందుగా వారు పాడే పాటలకు పరవశించిపోయే ప్రయాణీకులు బాలలకు డబ్బులిస్తుంటారు. వీరి వద్ద సంగీత సాధనాలు కూడా ఉండటంతో బాలల కచేరీ రసవత్తరంగా సాగుతుంటుంది. ఐదుగురు బాలలు గల ఒక ట్రూప్‌ని టికెట్ కలెక్టర్ ఒకరోజు పట్టుకుని టికెట్లు లేవని జరిమానా కట్టమన్నాడు. వారివద్ద అంతసొమ్ము లేకపోవడంతో సదరు టికెట్ కలెక్టర్ ఆగ్రహించి వారందరినీ స్టేషన్‌మాస్టర్ వద్దకు తీసుకువెళ్ళి నిలబెట్టాడట. వారిని మందలించి పోలీసులకు పట్టిస్తాడని అతను భావించగా రకరకాల పనులతో సతమతమవుతూ చిరాగ్గా ఉన్న స్టేషన్‌మాస్టర్ బాలల్ని, వారివద్ద ఉన్న సంగీత సాధనాలను చూసి ముచ్చటపడి ఒక అరగంట సేపు వారితో హాయిగా పాటలు పాడించుకుని పంపేసాడట. బాలల గానమాధుర్యం అటువంటిది మరి

టమాటా పండుగ



స్పెయిన్‌లోని బునాల్ పట్టణంలో ఏటా టమాటాలతో కొట్టుకుంటూ పండుగ జరుపుకుంటారట. 30వేల జనాభా గలిగిన ఈ పట్టణంలో టమాటాలు కాపుకొచ్చిన తరుణంలో ఒకరోజున ఒకరికొకరు పండిన టమాటాలతో కొట్టుకుంటారు. 1940వ సంవత్సరం నుండి ఈ పట్టణంలో టమాటాల పండుగ చేసుకుంటున్నారట! లా టమాటినో అనే పేరుతో చేసుకునే ఈ పండుగ కోసం లక్ష కిలోల టమాటాలు ఉపయోగిస్తారు. అన్నీ పండిన టమాటాలనే వాడటంతో పట్టణంలోని రోడ్లన్నీ టమాటా రసంతో ఎర్రబారిపోతాయిట! ఈ సందర్భంగా పట్టణంలో నివసించే వారు తమ పాత పగలు, ద్వేషాలు మరచిపోయి అందరూ ఆనందంగా పాల్గొంటారట!

ఓరా!

ఢిల్లీ పోలీసుల ఘనత

మహిళలకు భద్రత కరువైన ప్రముఖ నగరాల్లో దేశ రాజధాని న్యూఢిల్లీ బాగా పేరుపొందింది. నేరగాళ్ళను పట్టుకోవడంలో విఫలమవుతున్న పోలీసులు స్వయంగా నేరగాళ్ళ వలలో చిక్కుకుంటున్న సంఘటన ఇటీవల ఒకటి జరిగింది. రణవీర్‌సింగ్ అనే రౌడీ స్థానికంగా చిన్న చిన్న నేరాలు చేస్తూ పోలీసులకు బాగా అలవాటు పడిపోయాడు. ఇలా లాభం లేదనుకుని పోలీసు వేషంలో, పోలీసులతోనే కలిసిపోయి దందా చేయాలని అనుకున్నాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ వేషం వేసుకుని తనను గుర్తు పట్టని మరో పోలీస్‌స్టేషన్‌లో హౌస్‌ఆఫీసర్‌ను కలుసుకునేందుకు వెళ్ళాడు. ఇతని వేషాన్ని గుర్తు పట్టని అక్కడి కానిస్టేబుళ్ళు నకిలీ ఇన్‌స్పెక్టర్‌కు సెల్యూట్ చేసేశారట!

యాక్షన్ హీరో

ప్రముఖ హిందీనటుడు నానా పటేకర్‌ను ఇటీవల ముంబాయి శివార్లలో గల సైనిక్‌నక్కాల్‌లో స్పోర్ట్స అకాడమీ ప్రారంభించడానికి ఆహ్వానించారు. నానాపటేకర్‌కు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నదని తెలుసుగాని అంత ఉత్సాహం చూపిస్తాడని నిర్వాహకులు అనుకోలేదట. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఆ అకాడమీలో పర్వతారోహణ చేసే విద్యార్థులు అక్కడ గల పర్వతాలను అధిరోహించే ఒక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అకాడమీని ప్రారంభించడానికి వచ్చిన నానాపటేకర్ తాను కూడా పర్వతాన్ని ఎక్కుతానని విద్యార్థులతో చెప్పగానే నిర్వాహకులు ఆందోళన చెందారట. సినీనటుడు రిస్క్ తీసుకుంటున్నాడని, అతనికి ఏదైనా జరిగితే తమకు చెడ్డపేరు వస్తుందని వారి భయం. అయితే నానాపటేకర్ ఎంతో సాహసంతో నిజం హీరో మాదిరిగా విద్యార్థులతో పాటే తాడు ద్వారా పర్వతాన్ని ఎక్కి దిగాడట.

కనదగు నెవ్వరు గీచిన...



ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ !

✻ కె. బాలాజీరెడ్డి

జాతీయసమైక్యతకు ప్రతిరూపం ఎన్‌సిసి





కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, ఈశాన్యం నుండి గుజరాత్ వరకు గల విశాల భారతావని సమైక్యతకు ప్రతిరూపం ఎన్‌సిసి. జాతీయసమైక్యత, క్రమశిక్షణ అంటేనే ఎన్‌సిసి. వ్యక్తిత్వ వికాసం, ధైర్యం, ఉత్తేజం, స్నేహభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణం, లౌకిక దృక్పథం, దేశభక్తి, క్రీడాస్ఫూర్తి, స్వార్థ ఫలాపేక్ష లేని సేవాభావం పెంపొందింపజేయడంద్వారా విద్యార్థులు, యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఎన్‌సిసి ధ్యేయం. విద్యార్థులు సంపూర్ణ మానవులుగా ఎదిగేందుకు ఎన్‌సిసి శిక్షణ ఎంతగానో తోడ్పడుతుంది. చక్కని నడవడికను, సామాజిక సేవా దృక్పథం అలవడేందుకు విద్యార్థి దశ నుండే బీజం వేయడం, దేశానికి సేవ చేసేందుకు ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా ఉండే వీరకిశోరాలను తయారు చేసుకోవడం, ఉత్తమ నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేయడం ఎన్‌సిసి వల్లే సాధ్యం.

1948లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ చట్టాన్ని భారత పార్లమెంటు ఆమోదించడం ద్వారా నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) ఆవిర్భవించింది. 1942లో బ్రిటీష్ పాలకులు ఏర్పాటు చేసిన యూనివర్శిటీ ఆఫీసర్స్ ట్రెయినింగ్ కార్ప్స్ (యుఒటిసి)కు ఎన్‌సిసిని నకలుగా భావించవచ్చు. రెండో ప్రపంచ యుద్ధం కాలంలో యుఒటిసి బ్రిటీష్‌వారి అంచనాలకు అనుగుణంగా పనిచేయలేక పోయింది. అందువల్ల దీనికంటే మెరుగైన సర్వీసును ఏర్పాటు చేసుకోవాలనే తలంపు కలిగింది. యుద్ధ సమయాల్లోనేకాక సాధారణ సమయాల్లో కూడా యువత శక్తిసామర్థ్యాలను వినియోగించుకునే రీతిలో ఇది ఉండాలని నిర్ణయించారు. ఇందుకోసం పండిట్ హెచ్.ఎన్.కుంజ్రు ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పరిచారు. జాతీయస్థాయిలో స్కూళ్ళు, కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సంస్థ ఒకదానిని ఏర్పాటు చేయాలని ఆయన సిఫార్సు చేశారు. 1948 జులై 16న అప్పటి గవర్నర్ జనరల్ ఆమోదం తెలపడంతో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) ఆచరణలోకి వచ్చింది.

1965, 1971లలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు ఎన్‌సిసి క్యాడెట్లు సైనికుల తరువాత దేశ రక్షణలో కీలకపాత్ర నిర్వహించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని సైనికులకు అందజేయడంలో వారు నిరుపమాన సేవలు అందించారు. అంతేకాదు శత్రు శిబిరాలను కనిపెట్టి అందులోని శత్రు సైనికులను అపహరించేందుకు తోడ్పడే కాపలాదారులుగా కూడా వారు వ్యవహరించారు. దేశంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్‌సిసి క్యాడెట్లు తాము కూడా ముందుండి సహాయ పునరావాస కార్యకలాపాల్లో పాల్గొనడం మరిచిపోలేం. సైన్యంతో భుజం కలిపి వారు సహాయ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. రక్షణరంగం తరువాత ఎన్‌సిసికే అత్యంత ప్రాధాన్యత ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే 1965, 1971 యుద్ధాల తరువాత ప్రధానంగా నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ధ్యేయంగా ఎన్‌సిసి సిలబస్‌ను సవరించారు. ఎన్‌సిసి విద్యార్థులకిచ్చే సైనిక తరహా శిక్షణను తగ్గించారు. సామాజిక సేవా కార్యకలాపాలకు, యూత్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత పెంచారు.

ఎన్‌సిసి ఎలా ఉంటుంది?

స్కూళ్ళు, కళాశాలల్లో చదివే విద్యార్థులు స్వచ్ఛందంగా ఎన్‌సిసిలో చేరవచ్చు. ఇందులోని ఆఫీసర్లు, క్యాడెట్లకు సైనిక కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం ఉండదు. దీనిని నాలుగు డివిజన్లుగా విభజించారు. (ఆర్మీ డివిజన్లకు, వీటికి సంబంధం లేదు)

1. కళాశాలల్లోని బాలురకోసం సీనియర్ డివిజన్
2. పాఠశాలల్లోని బాలురకోసం జూనియర్ డివిజన్.

కాలేజ్ క్యాడెట్లు, స్కూలు క్యాడెట్ల శిక్షణ భిన్నంగా ఉంటుంది. సీనియర్ డివిజన్ యూనిట్లను కంపెనీలని, జూనియర్ డివిజన్ స్థాయిలో ట్రూప్స్ అని వ్యవహరిస్తారు. ఇవి ఎన్‌సిసికి చెందిన సీనియర్ బెటాలియన్ ఆధ్వర్యంలో నడుస్తాయి. సీనియర్ డివిజన్‌లో మళ్లీ మూడు డివిజన్లు ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కోసం ఇవి ఏర్పాటయ్యాయి. ఇందులో మొత్తం 3,65,000 మంది క్యాడెట్లు ఉంటారు. జూనియర్ డివిజన్‌లో 6,58,000 మంది ఉంటారు. కంపెనీలనేవి ఏదో ఒక కళాశాల స్థాయిలో ఉంటాయి. ఆర్మీ శిక్షణ పొందిఉండి అసోసియేటెడ్ ఎన్‌సిసి ఆఫీసర్ (ఎఎన్‌ఒ)గా గుర్తింపు ఉన్న లెక్చరర్ ఆధ్వర్యంలో కంపెనీ నడుస్తుంది. సీనియర్ డివిజన్ కంపెనీలో సుమారు 160 మంది క్యాడెట్లను చేర్చుకుంటారు. ఆర్మీ రెజిమెంట్‌లో పనిచేసే సైనికులను వీరికి శిక్షణ ఇచ్చేందుకు రెండు సంవత్సరాల కాలవ్యవధిమీద పంపుతుంటారు. ప్రతి ఒక్క సీనియర్ డివిజన్ కంపెనీకి ఒక జెసిఒ, ఎన్‌సిఒను



సర్టిఫికెట్ల ప్రదానం

క్యాడెట్లకోసం ఎన్‌సిసి డైరెక్టరేట్ మూడు విధాలైన సర్టిఫికెట్ల పరీక్షలు నిర్వహిస్తుంది. వీటిని రక్షణ మంత్రిత్వ శాఖ జారీచేస్తుంది. ఈ సర్టిఫికెట్లు కలిగిన క్యాడెట్లకు భవిష్యత్తులో ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లలో ప్రాధాన్యత ఉంటుంది.

ఎ సర్టిఫికెట్ : జూనియర్ డివిజన్, వింగ్‌లలోని క్యాడెట్లకు ఈ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. ఇందుకోసం క్యాడెట్లు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో నెగ్గాల్సి ఉంటుంది. థియరీలో ప్రథమ చికిత్స, సైనిక చరిత్ర, డ్రిల్ మూవ్‌మెంట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. డ్రిల్, టర్నౌట్‌పై ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షల్లో పాసైన వారికి పదవ తరగతి పరీక్షల్లో బోనస్ మార్కులు కలుస్తాయి.(ఇది ప్రతి రాష్ట్రానికి మారుతుంది)

బి-సర్టిఫికెట్ : సీనియర్ డివిజన్, వింగ్‌లలోని క్యాడెట్లకు ఈ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. ప్రతి విద్యా సంవత్సరలోనూ ఎన్‌సిసి బెటాలియన్స్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో నెగ్గినవారికి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసినప్పుడు, యూనివర్శిటీస్థాయి పరీక్షల్లో బోనస్ మార్కులు కలుస్తాయి. సర్జెంట్ ఆపైస్థాయి ర్యాంక్ పొందాలంటే ఈ సర్టిఫికెట్ తప్పనిసరి.

సి-సర్టిఫికెట్ : బి సర్టిఫికెట్‌కు సంబంధించిన సబ్జెక్టులే దీనిలోనూ ఉంటాయి. కాకుంటే మరికాస్త కష్టతరమైన రీతిలో ఉంటాయి. ఈ పరీక్ష బి గ్రేడ్‌లో పాసైనవారు కొన్ని ప్రభుత్వ పరీక్షల్లో రాత పరీక్షకు హాజరుకాకుండానే నేరుగా ఇంటర్వ్యూకు అర్హత పొందుతారు. 50 శాతం మార్కులతో పాసైనవారు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావచ్చు. ముఖ్యంగా బి, సి సర్టిఫికెట్లు కలిగిన వారికి సబ్‌ఇన్‌స్పెక్టర్స్, ఇన్‌స్పెక్టర్స్, డిఎస్‌పి పోస్టుల్లో రిజర్వేషన్స్ అవకాశం కూడా ఉంది. ఇంకా పలు రాష్ట్ర, కేంద్ర సర్వీసుల్లో వారికి ప్రాధాన్యత కల్పిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా బిఎస్‌ఎఫ్, టెర్రిటోరియల్ ఆర్మీ, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ వంటి అనేక ఉద్యోగాల్లో వీరికి ప్రాధాన్యత ఉంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో కూడా ఈ సర్టిఫికెట్లు కలిగిన వారికి ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

శిక్షణ కోసం ఇస్తారు.

జూనియర్ డివిజన్ యూనిట్లను ట్రూప్‌లుగా వ్యవహరిస్తారు. వివిధ పాఠశాలల్లో ఇవి పనిచేస్తాయి. ఆర్మీ శిక్షణ పొందిన ఓ ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో ఇవి ఉంటాయి. ప్రతి ఒక్కదానికి ఒక జెసిఓ, ఎన్‌సిఓ చొప్పున క్యాడెట్ల శిక్షణ కోసం ఉంటారు.

3 కళాశాల బాలికలకోసం సీనియర్ వింగ్

4. పాఠశాలల్లోని బాలికలకోసం జూనియర్ వింగ్ పేరిట డివిజన్లు ఉంటాయి. ఆర్మీకి చెందిన వైద్య విభాగం, సిగ్నలింగ్‌కు సంబంధించిన శిక్షణను ప్రధానంగా బాలికలకు ఇస్తారు. వారికి కూడా ఫిజికల్ ట్రెయినింగ్, డ్రిల్, డ్రైవింగ్, వాహనాల నిర్వహణ, సిగ్నలింగ్ డ్యూటీలు, ప్రథమ చికిత్స వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. బాలికల యూనిట్లను ఎన్‌సిసి వేరుగా నిర్వహిస్తోంది. సీనియర్ వింగ్‌లో 69వేలు, జూనియర్ వింగ్‌లో 73 వేలు చొప్పున చేర్చుకుంటారు.

ర్యాంకుల విధానం

ఎన్‌సిసిలో చేరిన క్యాడెట్లు చూపిన ప్రతిభ, సీనియారిటీ ఆధారంగా వారికి ర్యాంకులు కేటాయిస్తారు. అన్ని డివిజన్లలో ఇవి ఒకేవిధంగా ఉంటాయి. వీరు ఇతర సైనిక సర్వీసుల్లోలాగా ఒకరికి ఒకరు శాల్యూట్ చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ తనకన్నా సీనియర్‌ముందు నిలబడాల్సివస్తే అటెన్షన్ పొజిషన్‌లో ఉంటేచాలు. ర్యాంకులు పొందినవారిని క్యాడెట్ ఎన్‌సిఓలుగా పిలుస్తారు. జూనియర్ డివిజన్, జూనియర్‌వింగ్‌కు సంబంధించి మాత్రం సర్జెంట్ మేజర్ స్థాయికి మించి ర్యాంకులు ఉండవు. ఓ ట్రూప్‌కు చెందిన సర్జెంట్ మేజర్ ట్రూప్ సర్జెంట్‌గా పిలవబడతారు.

ఎన్‌సిసిలో ర్యాంకులు

(సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్) :

-సీనియర్ అండర్ ఆఫీసర్ (కంపెనీకి ఒకరు ఉంటారు)
-అండర్ ఆఫీసర్ (కంపెనీలో ముగ్గురు ఉంటారు)
-కంపెనీ సర్జెంట్ మేజర్ (కంపెనీలో ఒకరు ఉంటారు)
-కంపెనీ క్వార్టర్ మాస్టర్ సర్జెంట్ (కంపెనీకి ఒకరు ఉంటారు)
-సర్జెంట్ (కంపెనీకి ముగ్గురు ఉంటారు. సిఎస్‌ఎం, సిక్యుఎంఎస్‌కాక)
-కార్పొరల్ (కంపెనీకి పదిమంది చొప్పున ఉంటారు)
-లాన్స్ కార్పొరల్ (కంపెనీకి 15 మంది చొప్పున ఉంటారు)
-క్యాడెట్



ఎన్‌సిసి నిర్వహణతీరు

ఎన్‌సిసి హెడ్‌క్వార్టర్స్ న్యూఢిల్లీలో ఉంది. లెఫ్టినెంట్ జనరల్ హోదా కలిగిన అధికారి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తారు. ఎన్‌సిసి విధానం, నిర్వహణ తీరుపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలిచ్చేందుకు ఓ కేంద్ర సలహా కమిటీ ఉంటుంది. అలాగే ప్రతి రాష్ట్రం స్థాయిలో కూడా రాష్ట్ర సలహా కమిటీ పనిచేస్తుంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సిసి నడుస్తుంది. డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యే వ్యక్తి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో పనిచేసిన వారై ఉంటారు. ఎన్‌సిసి మొత్తం 16 డైరెక్టరేట్స్‌గా విభజితమై ఉంది. ప్రతి రాష్ట్రం, లేదా కొన్ని రాష్ట్రాలు కలిసి ఒక డైరెక్టరేట్‌గా ఏర్పడి ఉన్నాయి. చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పెద్ద రాష్ట్రాల పేరిట ఏర్పడే డైరెక్టరేట్‌లలో భాగమై ఉన్నాయి. బ్రిగేడియర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఇవి నడుస్తాయి. ఈ డైరెక్టరేట్‌లు మళ్లీ ఆయా రాష్ట్ర విస్తీర్ణాన్నిబట్టి గ్రూపులుగా విభజించబడతాయి. కల్నల్‌స్థాయి అధికారి వీటిని పర్యవేక్షిస్తారు. ఎన్‌సిసి బెటాలియన్స్, ఎన్‌సిసి ఎయిర్‌ఫోర్స్, నేవల్ యూనిట్లు వీటిలో కలిసి వుంటాయి. (గ్రూపులు మళ్లీ బెటాలియన్లుగా (లెఫ్టినెంట్ కల్నల్‌స్థాయి అధికారి ఆధ్వర్యం) విభజించబడి ఉంటాయి. ప్రతి బెటాలియన్ మళ్లీ కంపెనీలుగా విభజించబడి ఉంటుంది.

ఎన్‌సిసి ఆర్మీ యూనిట్లలో ఇన్‌ఫాంట్రీ,



మహిళా క్యాడెట్ల కవాతు

ఆర్మడ్ కార్ప్స్, ఆర్టిలరీ, ఇంజనీర్స్, సిగ్నల్స్‌లను కలిగిఉంటాయి. ఇదేవిధంగా నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు కూడా యూనిట్లు ఉంటాయి. ఎన్‌సిసికి అనుబంధంగా అగ్జిలరీ క్యాడెట్ కార్ప్స్ (ఎసిసి) నిర్వహించబడుతోంది. 13 నుండి 16 సంవత్సరాలలోపు బాలబాలికలను ఇందులో చేర్చుకుంటారు. సామాజిక సేవా శిబిరాలు ఏటా నిర్వహిస్తారు. రోడ్ల నిర్మాణం, మొక్కలు నాటడం, మంచినీటి చెరువులు, కుంటలు శుభ్రం చేయడం, పిల్లల పార్కులు, ఆటస్థలాలు నిర్మించడం, గ్రామాల్లో అక్షరాస్యతా ప్రచారం నిర్వహించడం వంటివాటిపై ప్రధానంగా శిక్షణ ఉంటుంది.

ప్రతి విద్యార్థి చేరడం అవసరం

దేశంలో పాఠశాలకు, కళాశాలకు వెళ్లే ప్రతి విద్యార్థి ఎన్‌సిసిలో చేరడం ఎంతో అవసరం. ఎన్‌సిసి పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి కచ్చితంగా ఆర్మీలో చేరాల్సిన పనిలేదు. ఎన్‌సిసిలో చేరడానికి ఎలాంటి కఠినమైన నిబంధనలు లేవు. ఏ విధమైన శారీరక, రాతపరీక్షలు లేవు. శారీరకంగా, మానసికంగా ఎలాంటి లోపం లేని సాధారణ విద్యార్థి అయినా ఎన్‌సిసిలో చేరవచ్చు. అయితే కనీసం 5.5 అడుగుల ఎత్తు, 50 కిలోల బరువు ఉండాలి. చేరిన ప్రతి ఒక్కరికి యూనిఫారం, బ్యాడ్జి, బెల్ట్, గుర్తింపు కార్డు, ఇతర పరికరాలను అందజేస్తారు. ప్రతి ఎన్‌సిసి కంపెనీలో 160 మందికి మించి క్యాడెట్లను చేర్చుకోరు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ట్రూపులలో వందమందికి మించి చేర్చుకోరు. ప్రతి ఏటా రిక్రూట్‌మెంట్ జరుగుతుంది.

ఎన్‌సిసి విశేషాలు

- 1997, నవంబర్ 23న ఎన్‌సిసి 49వ వార్షికోత్సవాలను జరుపుకుంది. ఆ రోజు నుండి గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లోకి అడుగిడింది.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్‌సిసి క్యాడెట్లు 11 లక్షల ఆరువేల మంది ఉన్నారు. వింగులవారీగా చూస్తే ఆర్మీవింగ్‌లో -8,92,911 మంది, ఎయిర్‌వింగ్‌లో-65,450 మంది, నేవల్‌వింగ్‌లో-65,050 మంది ఉన్నారు. అన్ని వింగ్‌లలో కలిపి బాలికా క్యాడెట్లు -1,39,957 మంది.
- ఎన్‌సిసి ఎయిర్‌వింగ్‌లో గ్లైడింగ్, ఫ్లైయింగ్ వంటి పాపులర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. నేవల్‌వింగ్‌లో నావిగేషన్ కమ్యూనికేషన్, డామేజ్ కంట్రోల్, షిప్ సేఫ్టీ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.
- 1970 నుండి ఎన్‌సిసి సుమారు 40 పర్వతారోహణ క్యాంపులు నిర్వహించింది. ఇందులో బాలురకోసం 22 నిర్వహించగా బాలికలకోసం 18 నిర్వహించింది.
- తొలి ఎన్‌సిసి గేమ్స్‌ను న్యూఢిల్లీలో 1997 ఆగస్టు 6-15 మధ్య నిర్వహించారు. దేశవ్యాప్తంగా 1350 మంది బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలు విజయవంతం కావడంతో ఏటా ఆగస్టులో ఎన్‌సిసి గేమ్స్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద కెనడా, సింగపూర్, యుకె, బంగ్లాదేశ్, శ్రీలంకలో ఎన్‌సిసి కార్యకలాపాలు నిర్వహించింది.
- జాతీయస్థాయిలో నిర్వహించిన పలు ఇతర కార్యక్రమాల్లో కూడా ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.
- భారత్‌లోని యువకులకోసం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ అవార్డ్‌కు ఎన్‌సిసికి చెందిన ఎనిమిది క్యాడెట్లు ఎంపిక కావడం గర్వకారణం.

సామాజిక సేవా కార్యకలాపాల్లో ఎన్‌సిసి

జాతీయ విపత్తులు సంభవించినప్పుడు సేవా కార్యకలాపాల్లో ఎన్‌సిసి క్యాడెట్లు ఎనలేని సేవలు అందించారు. ఇంకా వయోజన విద్యా కార్యక్రమాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి విషయాల్లో కూడా వారందించిన సేవలు అపూర్వం.

గ్రామాలు దత్తత తీసుకుని వాటిని శుభ్రపరిచే కార్యక్రమాలు, బాలల సంక్షేమం

వరకట్న వ్యతిరేక ప్రచారం, కుష్టువ్యాధిగ్రస్తులకు తోడ్పాటు అందించడం

రక్తదానం, నేత్రదానం

మొక్కలు నాటడం వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సిసి క్యాడెట్లు నిమగ్నమై ఉన్నారు. ●



కఠినమైన శిక్షణ

ఎన్‌సిసి శిక్షణ సాధారణంగా కళాశాలల్లో వారాంతాల్లో ఉంటుంది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమై ఒంటిగంటకు ముగుస్తుంది. శిక్షణ సందర్భంగా క్యాడెట్లతో డ్రిల్ చేయిస్తారు. ఇందులో చేతులతో, రైఫిల్‌తో శిక్షణ ఉంటుంది. మ్యాప్ రీడింగ్ చేయిస్తారు. భారత చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, ఇండియన్ మిలటరీ హిస్టరీ, జనరల్ నాలెడ్జ్, నాయకత్వ లక్షణాలు, నిర్వహణ వంటి వాటిపై కూడా క్లాసులు నిర్వహిస్తారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, ఎన్‌సిసి డే సందర్భంగా పెరేడ్స్ నిర్వహిస్తారు. ఇక ఏడాది పొడవునా క్యాంపులు నిర్వహిస్తారు. ఒక్కో క్యాంపు పది నుండి 12 రోజులపాటు కొనసాగుతుంది. క్యాడెట్లకు ప్రాక్టికల్‌గానే కాక, థియరీకి సంబంధించిన సర్వజ్ఞానం కలుగజేసేందుకు ఇందులో ప్రయత్నిస్తారు. సెంట్రీ పోస్టింగ్, క్వార్టర్‌గార్డ్ వంటి అంశాలతో శిక్షణ ఆర్మీ తరహాలో కొనసాగుతుంది. విద్యార్థుల్లో చక్కని క్రమశిక్షణకు ఇది తోడ్పడుతుంది. ప్రతి క్యాడెట్ కనీసం ఏడాదిలో రెండు క్యాంపులకైనా హాజరు కావాల్సి ఉంటుంది. అప్పుడే పరీక్షలు రాసేందుకు అర్హుడవుతాడు. శిక్షణ సందర్భంగా క్యాడెట్లకు .22 రైఫిల్స్, 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్, ఎల్ఎంజిలను వినియోగించడం నేర్పిస్తారు. ఎన్‌సిసి శిక్షణలో భాగంగా పర్వతారోహణ కూడా ఉంటుంది. జాతీయస్థాయిలో నిర్వహించే దీనికి ప్రతి డైరెక్టరేట్ నుండి హాజరు కావాల్సి ఉంటుంది. ఇంకా జాతీయ సమైక్యతా క్యాంపులను కూడా నిర్వహిస్తారు. క్యాడెట్లకు ఇవి మరింత ముఖ్యమైనవి. ఇక వివిధ ప్రదేశాలను చూసేందుకు తీసుకువెళతారు. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రదేశాలలోని ప్రజల జీవన విధానాన్ని విద్యార్థులు ఆకళింపు చేసుకునేందుకు దోహదపడుతుంది. మరోవైపు క్యాంపుల పరిధిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై పోటీలు ఉంటాయి.

కథ — ❋ పులి కళ్యాణి

బాపూ బర్త్‌డే

అహోబిలం తెగ ఆరాట పడిపోతున్నాడు. రేపటికి అనుకున్నట్టుగా అన్ని ఏర్పాట్లు సక్రమంగా వుంటాయో... లేదో... ఏమో? ఎవుడ్నీ నమ్మడానికి వీల్లేదు. ఎందుకంటే నేను ఎమ్మెల్యేగా గెలిచినాక అంతా కొత్తకొత్తగా వుంది. ఏదీ యివరంగా చెప్పరు. ప్రతి సమాచారం... మతలబు కొసరి కొసరి చెప్పి నొక్కేస్తారు. తానేమో అప్పటికి అర్థంగాక... తర్వాత అవసరమై గిలగిలలాడిపోతాడు.

తాను - పైగా అధికార పార్టీ ఎమ్మెల్యే - అహోబిలం అంటే అసలు అందరికీ ఎంత హడలుండాలె! ఏదీ... ఎవడెవడో వచ్చి నిశానీ దస్కతులు గిలికిచ్చుకుని పోతారు - ప్రెతిదీ అవసరమేనని ఈ పి.ఏ. అసిస్టెంటు వాగుడు... రేపు ఏం కొంప మునిగిపోతుందోనని తాను హడలి చావడం... అందుకే అదే పనిగా అర్థం తెలిసినా తెలవక పోయినా వచ్చీరాని ఇంగ్లీషు పదాలు వాడడం బాగా అలవాటు చేసుకున్నాడు.

తానసలు పెద్దగా చదువుకోకపోవడం పెద్ద ఇబ్బందే అయిపోయింది! అద్దంలో చూసుకుంటే చిరంజీవి టైపులో తన మొహం... ఆ మీసాలు.. అబ్బో... రూపానికేం తక్కువ లేదు గానీ... ఆ అద్దంలో తన చదువే కనిపిచ్చడం లేదు గదా! అదో దిగులు! అందువల్లనే తాను అడ్డమైన వాడి నల్లా పట్టుకుని విషయాలు చెప్పమని బతిమిలాడుకోడం... వాడు కొసరి కొసరి వడ్డించినట్లు చెప్పడం... ఇదేం బాగా లేదు. నిజవే - కానీ ఎట్లా.. అంతా ఇంగ్లీషు యవ్వారమాయె!

“ఏమాయె.. అంతా 'రెడీ' చేసింద్రా...! జనాలను 'గాదర్' చేయటానికి 'ప్లాను' తయారు చేసింద్రా?” అహోబిలం అసహనంగా అడిగాడు.

“ఓ.కె. అంతా అయిపోయినంక భోజనాలున్నయని చెపితే... గోచీలోళ్ళు సత్తు కంచాలు.. తపేలాలందుకుని కుప్పలు కుప్పలుగా వచ్చిపడ్తరు - ఫికర్ చేయకుంద్రి... ఓ ఎడం భుజం వివరించాడు.. అహోబిలానికి వళ్ళు మండిపోయింది.

“అయితే... అన్న సంతర్పణ పెడదావనే? అదెట్ల కుదర్తది! అయినా ఇదేమన్న 'ఫెస్టివలా'? దేశంలోని దరిద్రంగాండ్లందరు పోగయితరు - వాళ్ళను సూడంగనే నాపెయంత కారం పూసినట్లయితది... ధు... గలీజుగాండ్లు...

“మీరు యమ్మెల్యే అయిటానికి ఓటేసినోండ్లు... పన్లోపని...!” కుడిభుజం కులాసాగా సర్దాడు.

“దొంగ వెధవలు రెడీ... సందు దొరికితేసాలు... సంతర్పణ! ఖర్చు... సర్సర్లే.. ఆ పాయిఖానాలు వెలుగు పతకం కింద టోకున గుత్తకు తీస్కొని నడిపిస్తండే.. రెడ్డి.. ఆయన్ని పిలిచి ఆ భోజనాల సంగతి చూస్కోమను! పీడాపోతది.... కటివ్వడు పాడు లేదు... అద్సరె గానీ... దండలు... 'గార్లండ్స్'... దండలు...

“ఆల్‌రడీ ఆర్డరేసినం... మన డ్రైవరు చిన్నాగాడు అదేపనిల తిరుగుతండు...” ఎడంభుజం శాంతపరిచాడు.

అహోబిలం మహ ఆరాట పడిపోతున్నాడు. రేపటి కార్యక్రమం ఎంత సక్సెస్ అయితే తనకంత పబ్లిసిటీ... ప్రతిష్ట...!

“అద్సరే.. ఫొటోగ్రాఫరు సంగతి జూసింద్రా.. అది చాలా ఇంపార్టెంటు... రికార్డు... అది సరిగ్గ లేకపోతే గివన్ని వేస్టు!

“వీడియో వాడ్ని కూడా మాట్లాడినం! వాడో అరగంట తీస్తడు. దానికి మన కంట్రాక్టరు వెంకటస్వామిని సరిసినం...”

హమ్మయ్య! అహోబిలం కాస్తంత వూపిరి పీల్చుకునే లోపునే లోపల్నుండి వారి భార్య భానుమతి గారు కేకేసింది!

“ఏందండీ.... ఏందీ హడావుడి.. మల్లా ఏమైనా ఎలక్సనా... గిపుడే యాడున్నయి-” భానుమతి అద్దం ముందు నిలబడి పూలు తలలో సవరదీసుకుంటూ గోముగా అడిగింది. అహోబిలం అంటే ఆవిడకు



పెద్ద గౌరవం లేదు - ఎందుకంటే డబ్బులు సంపాదించడంలో తప్ప మరే ఇతర 'కళ'లోనూ అహోబిలానికి అచ్చిరాదని ఆవిడకు బాగా తెలుసు. ఏదో ఆ ఎలక్షను టైముకు ఎగ్సపార్టీ వాండ్లు వాండ్లలో వాండ్లు తన్నుకుని పోటీ కేండేటును పెట్టడం వల్ల - వాండ్ల ఓట్లు చీలి అహోబిలం అనుకోకుండా గెలిచాడు. లేకపోతే ఖచ్చితంగా ఓడిపోయేవాడు - ఎందుకంటే వాళ్ళిద్దరికీ వచ్చిన ఓట్లు కలిపితే అందులో సగానికన్నా ఓ వంద మాత్రమే అహోబిలానికి వచ్చినవాయె! అందుకే అహోబిలాన్ని ఆవిడ ఓ 'ప్రజాప్రతినిధి'గా గుర్తించి అట్లా మర్యాద ఇవ్వడం 'వేస్ట్' అనే నిర్ణయానికి వచ్చేసింది. అదీగాక అహోబిలం అసలు ఈ రాజకీయాలకే పనికిరాడని ఆవిడగారికో ప్రత్యేకమైన వ్యక్తిగత అభిప్రాయం కూడా ఒకటి వున్నదాయె!

“అవునే... ఆ డైనింగ్ టేబుల్‌కూ... కిచెన్‌కే మీ ఆడాండ్లు పరిమితం... గదంతే” ఛ... ఛ... ఎలా బతుకుతారో... ఏమో... అవతల రేపు కొండంత 'ప్రోగ్రాం' పెట్టుకుని తన్నక చస్తున్నాను. నీకేమో సోకులు కావాలె. మొగుడి 'ప్రాబ్లమ్స్' అస్సలు పట్టించుకోవాయె...”

“మీకు సమస్యలా... వార్నీ... ఉంటే జనాలకుండాలెగానీ... చేతికింద అంతమంది బలాదూర్ పనోండ్లున్నరు గద... అబ్బో... భోజనాలు.. డిన్నర్లు...” భానుమతి వయ్యారంగా మూతి మూడు వంకర్లు తిప్పింది.

“డిన్నర్ల సంబరం కాదు.. రేపుగాంధీగారి 'బర్త్‌డే' - బర్త్‌డే! దానికోసం దండలేసి వూరంత తిరగాలె... వాడల నిండా మన ముఖ్యమంత్రిగారి పాలన... ప్రోగ్రోస్ గురించి స్పీచ్‌లు... సీక్రెట్సు చెప్పాలె... పో... దమాక్ లేదే మీకు!” అహోబిలం ఎ చిన్న గాండ్రింపు గాండ్రించాడు.

* * *

దప్పళం గాడి అసలు పేరు ఎవడికీ తెలవదు. వాడి వయసెంతో ఎవడికీ తెలవదు. వాడిక్కూడా తెలవదు! వాడికెవరూ లేరు. ఆ సంగతి మాత్రం వాడికి తెలుసు. మనిషి ఎముకలకు వాడి చర్మం అతుక్కుపోయి వుండడం... మొహమంతా ఎక్కడికక్కడ పీక్కుపోయి చప్పిడి పడిపోవడం... వాడికింకా జ్ఞానదంతం రాకముందే వున్న దంతాలన్నీ వూడిపోవడం వల్ల నోరు బోసిదయింది. ఒళ్ళంతా కుంచించుకుపోయి గిడసబారిపోయాడు. వాడు మరింక అంగుళం కూడా ఎదిగే అవకాశం లేదని అన్ని శాస్త్రాలూ నిక్కచ్చిగా తేల్చి చెప్పాయి.

వాడు పుటుకతోనే అమ్మా అయ్యా పోవడంతో వాడికి పాలుగానీ... తిండిగానీ దొరకనేలేదు. అట్లా ఎండుటాకులా అల్లల్లాడుతూ.... దేకుతూ పాకుతూ బ్రతికేస్తుంటే... వాడి అవయవాలలో ఎదుగుదల ఆగిపోయి ఇపుడు మూడున్నర అడుగులకే కుదించుకుపోయాడు. కొంతకాలం క్రిందట వాడు నాలుగడుగుల ఎత్తుదాకా వుండేవాడని జనం చెప్తారు. ఎత్తు అట్లా కుదించుకుపోవడానికి కారణం 'ఆహార లోపం' అనీ, ఇంగ్లీషు డాక్టరు ఇంగ్లీషు భాషలో 'మాల్‌న్యూట్రిషన్' అనీ నిక్కచ్చిగా తేల్చి చెబుతారు. ఇంకా వాడు నేలబారుకు కుంచించుకుపోయే అవకాశం కూడా ఎక్కువేనట! అది దాని లక్షణమట! అయితే వాడు దీన్నేం లక్ష్యపెట్టకుండా నరాల బిగుతు మీద బతికేస్తున్నాడు. అన్నట్లు వాడి తలమీద వెంట్రుకలు కూడా ఇదే కారణం వల్ల ఏనాడో చాలా సహజంగానే రాలిపోయి అసహజమైన గుండు ఏర్పడింది.

ఊరిగుడి అరుగుల మీదా... పక్కనే రావిచెట్టు చప్టా... యాకోబుగాడి కూలిన గుడిసె అన్నీ

వాడి నివాస స్థలాలే! అయితే ఈ మధ్యన రోజూ పదీ... ఇరవై సంపాదిస్తుండడంతో అదో.. ఇదో తినేసి మరీ నేలబారుకు దిగిపోకుండా ఎత్తును మాత్రం అదుపులో వుంచుకోగలుగుతున్నాడు.

వాడికి చలీ... ఎండా జమా ఖర్చులు లేవు.. ఈ మధ్యన మాత్రం రెండ్రోజుల్నుండి బాగా నీరసంగా వుండి సరిగ్గా 'నిలబడలేకపోతున్నాడు' కీళ్ళలో వణుకు వంటిది కూడా వస్తుంది. పైగా సన్నగా జ్వరం కూడా. అసలిదంతా ఆ రంగు మహాత్మ్యం! దాని వల్లనే ఆ జ్వరం అని ఆరెంపీ డాక్టరుగారు సెలవిచ్చినారు కూడా!

* * *

రాత్రి పడగ్గదిలోకి అడుగు పెట్టిన అహోబిళం మనసంతా ఆనందంతో నిండిపోయింది. భానుమతి పక్కమీద విలాసంగా దిండునానుకుని పడుకుని కాళ్ళాడిస్తుంది. అహోబిలానికి ఒళ్ళు మండిపోలేదు. తిమ్మిరెక్కింది.

"రేపు నువ్వు కూడా జర గాంధీ బొమ్మ దగ్గరకు రావాలె! 'బర్త్‌డే' గద!" అహోబిలం ఉల్లాసంగా అన్నాడు.

''గట్లనా!'' భానుమతి కండ్లుమిటకరించింది.

"మరె.. దండకూడ వెయ్యాలె! 'రోజ్‌గార్లండ్' తెప్పిస్తున్నగద...!" అహోబిలం బుజాలెగరేశాడు!

"దండా.. నీ మెడలెయ్యడానికా?'' భానుమతి వికవిక నవ్వడంతో అహోబిలానికి అపుడు ఒళ్ళు మండిపోయింది. "చాల్లే సరసం... గిట్లాంటి 'జోకు'లు నాకు బాగుండవు!" అని విసుక్కున్నాడు.

"లేకపోతే మరేంది? అసలు నేను పొద్దున్నె యాడికి రావాలె?"

"గాంధీ స్టాట్యూ దగ్గరకు!"

"గదే! మరి మనూర్లె గాంధీ స్టాట్యూ ఎక్కడుందని?"

అహోబిలం దబ్బున మంచంమీద నుండి కిందపడ్డాడు. బుర్రంతా గిరగిర తిరిగి పోవడంతో నడుం కలుక్కుమన్నా బాధ కలగలేదు. "అదే.. అదేనే.. ఎక్కడ్నంటే... యాడనంటే.. నిజవే... యాడుందే!" భానుమతి మళ్ళా కిలకిల నవ్వే సమాధానంగా ఇవ్వడంతో అహోబిలం కుంటుకుంటూ బయటపడి కుడి, ఎడమ భుజాల్ని జరూరున పిలిపించి అంతెత్తున ఎగిరిపడ్డాడు.

"యూస్‌లెస్ ఫెలోస్! అస్సలు మీకు దమాక్‌లున్నాయిర! అస్సలు మనూర్లె గాంధీగారి స్టాట్యూ యాడుందిరా! బుద్ధుల్లేవురా... అసలు నేను రేపు ఎవడికేయాల్రా దండ! అవతల మంత్రిగారు కూడా దిగబడ్తాడేమో... అసలు నా ఫేట్ బాగా లేదు. అసలు రేపు నేను నా ఫేసెట్ల చూపించాలె..

"అరె.. గాంధిగారి యిగ్రహం మనూర్లె లేకపోటనేంది.. సిత్రం... ఆ చిన్న బడిలోనో... హైస్కూలు లోనో వుండేవుంటుంది. పద... పద...!" తర్వాత స్కూటర్లమీదా... ఒక జీపేసుకుని అనుచరులు ఊరు ఊరంతా కలియదిరిగారు! ఒకటే తిరుగుడు... సందులు.. గొందులు... చౌరస్తాలు... మెయిన్‌రోడ్డు... మార్కెట్ యార్డు.. ఎందరివో విగ్రహాలు... చిన్నవి... పెద్దవీ వున్నాయాయె... మరి గాంధీగారి బొమ్మ ఎక్కడా కనపడకపాయె!

"ఛు... అసలు జనాలకు బుద్ధి లేదు.. మనకు 'ఇండిపెండెన్స్' తెచ్చిన గాంధీగారికే గతిలేకుండా చేసింద్రు.. ఛు... పురుగులు పడిపోతారు.. ఎట్లరా... రేపటికి ఏదైనా మార్గం చూడండ్రి... అరె... అన్ని దండలు.. కట్టిపిచ్చినవ్.. నేను సచ్చినంక నా పాడెమీద జల్లుండ్రి... ఛు..." అహోబిలం లబోదిబోమని ఓ కుర్చీలో తలపట్టుకుని కూర్చుండిపోయాడు. ఒకటే దిగులు... కుడి, ఎడమలు దిక్కుతోచక చిందులేన్తా అంగలారుస్తున్నారు.

"మీకు దండలేయడానికి ఒక గాంధీ బొమ్మ గావాలె... అంతేగద! దానికంత పరేషాన్ ఎందుకయితండ్రు...!" భానుమతి చల్లగా అహోబిలంతో అనడంతో అహోబిలం అదిరిపోయాడు. తర్వాత జాగ్రత్తగా వినంగానే అహోబిలంలో ఆనందపు ధార బిలం నుండి బయటకు పొంగుకొచ్చినట్లయి మొహం కాస్తంత తెరిపిన పడ్డట్లయింది.

ఒక్క ఉదుటున లేచి అటు కుడి బుజాన్ని... ఇటు ఎడం బుజాన్ని పిలిచి, చకచక ఆర్డర్లు 'పాసు' చేసి పారేశాడు.

"ఒరేయ్... దండలు మరిన్ని పట్రండి... భోజనాలు ఫస్టుగుండాల... మంచి మంచి వంటకాలు కానియనండ్రి... ఛలో.. నామొకం చూసుకుంట నిలబడకండి.. అరె.. మాంచి సెంటర్ల చూసి 'ఫిక్సు' చేయండ్రి... గాంధీగారి బర్త్‌డే మరి....

పొలోమని జనాలు ఆ రేత్రి బయటకు పరుగులు తీశారు.

× × ×

ఎండ బాగా మండిపోతుంది. ఉదయం తొమ్మిది గంటలే అయినా మబ్బు విడిచిన ఎండలో ఒళ్ళంతా చిరచిరలాడిపోతుంది.

రాత్రికి రాత్రి కుడిబుజం-ఎడంబుజంల ఆధ్వర్యంలో లైట్లు బిగించి మరీ సుతారి పనోళ్ళు నిర్మించిన ఆరడుగుల వేదిక చప్టా బహుసుందరంగా వుంది. నడిబజారు సెంటర్లో వుంది. నగిషీలు కూడా చెక్కారు. తోచిన రంగులు పూశారు.

దూరంగా గుంపులు గుంపులుగా జనం గుమిగూడారు.

అహోబిలానికైతే ఆత్రంగా వుంది. మనిషి కాలు ఒకచోట ఆగటం లేదు. వూరికే హడావుడి పడిపోతున్నాడు. ఇతర్ల ఆధ్వర్యంలో చెవులప్పగించి చెప్పిన పనులు చేసేవాడు. ఈనాడు స్వయంగా తనో కార్యక్రమాన్ని జయంగా నిర్వహించబోతున్నాడు. ఓహో... అవతలేమో భోజనాల ఏర్పాట్లు... ఘుమఘుమలాడిపోతున్నాయి.

"బ్యాండుమేళాలు... డప్పులు కూడా వచ్చినై! మోతమోగిచ్చుమంటారా?" కుడిబుజం చిందులేస్తూ అన్నాడు.

భానుమతికిదంతా నవ్వులాటగా వుంది. అప్పటికే అయిదారుసార్లు అహోబిలం తన శ్రీమతి అమోఘమైన తెలివితేటల్నీ... సమయస్ఫూర్తినీ తనకున్న పరిధిలో పొగిడి పొగిడి అలిసిపోయాడు.

"నీది బుర్రకాదా... వజ్రాల పత్ర! ఓహో... అహో... అసలు మంత్రాంగం చేయాల్సిందానివి... మినిస్ట్రీ... హత్తెరి అందుకనేమో చానామంది మహిళలకు రిజర్వేషన్లో అని అల్లరిపెడ్తున్నారు - అది చాలా అవసరం... అడపాదడపా నీలాంటి వాండ్లు తగిలితే మా కష్టకాలంలో ఆ సలహాలు గట్టెక్కిస్తాయి... సేఫ్‌గార్డ్స్...!"

"పొగిడితే నేనేం పొంగిపోను... అవతల పని చూస్కోండి! పొద్దెక్కితె చాలా ఇబ్బంది తెలుసుగద...!" భానుమతి మాటలతో అహోబిలానికి ఒక్కసారే చెమట పట్టేసింది. ఇది నిజవే... "పొద్దెక్కితే వచ్చే తిప్పలు... తనవీ... వాడివీ... పైకి చేతులెత్తి దేవుడికో దండం పారేశాడు.

"నువ్‌కూడా తయారవ్... రెడీ... మినిస్టర్ గారొస్తే... గార్లెండోటి పారేస్తే పీడాపాయిరి - అనుకోకుండా అర్థాంతరంగా ఎలక్షన్లొచ్చినా 'సేఫు...' అహోబిలం అగ్గగ్గ లాడిపోయాడు.

అవతల ఎండ భగభగలాడిపోతుంది. లోపల మండే జ్వరం.. ప్రాణం అంతా నిస్సత్తువగా వుండి చెమట్లు పడ్తున్నాయి. దప్పళం గాడు కాళ్ళు వణక్కుండా బిర్రబిగడదీసుకుని కదలకుండా... చప్టామీద కర్రపుచ్చుకుని, ఒంగోని అచ్చుగాంధిగారి బొమ్మలా నుంచున్నాడు.. అసలు వాడి రోజువారీ జీవనోపాధి అదేనాయె! గత అయిదారేండ్ల నుండీ చుట్టుపక్కల టౌన్లలో.... గ్రామాల్లో తెల్లసిల్వరు రంగు పూసుకుని... గంటా... రెండు గంటలూ నిలబడితే అబ్బురపడే పుణ్యాత్ములు రూపాయి... అర్ధరూపాయి పడేస్తేనే వాడిపోషణ.. పౌష్టికాహారం... ఆ ఏరియాలో అట్లా అచ్చు 'గాంధి' గారిలాంటి 'మనిషి'... అట్లా కదలకుండా నిలబడగలోడు మరింగలేరు... ఛాలెంజ్! అందుకే అర్ధరాత్రి భానుమతి ఇచ్చిన అమూల్యమైన సలహాను అహోబిలం ఆచరణలో పెట్టేశాడు. ఎందుకంటే అప్పటికి ఆ గండం అట్లా గట్టెక్కిపోతే... రేపట్నించే చందాలు భారీగా వసూలు చేసి అట్టహాసంగా అదే సెంటర్లో 'నిజెంగాంధీ స్టాట్యూ' నిలబెట్టడానికి నిర్ణయం కూడా తీసుకున్నాడు గదా!

సిల్వరు రంగు మెరిసిపోతనూనే చిటమటలాడిపోతుంది. వళ్ళంతా ఎండకు చీదరగా వుంది - చప్టామీద అంతెత్తున అలవాటు లేక కండ్లు తిరిగి పోతున్నాయి - కడుపులో ఆకలో... అగాధమో అల్లరి పెడుతుంది. చిత్రంగా డొక్క బాగా లోపలికి కుంచించుకు పోతుండడంతో దప్పళంగాడికి భయం పుంజుకుంది. తన ఈ వున్న ఎత్తు కూడా ఇంకా కుదించుకుపోతుందా? అందుకే తననట్లా అంతెత్తు మీదన నిలబెట్టారా? అమ్మో... వామ్మో... గుండె దడతీస్తుంది. పైన మాడు మంటలెత్తిపోతుంది. అరె... ఈ జనం ఇంకా రారేం..?

భయం!

కడుపునిండుగా భయం... చేతులు కొంకర్లు పోతున్నట్లు భయం... చుట్టూ మేడలె మిద్దెలు గిరగిరా తిరుగుతున్నట్లు.. గాండ్రు... గాండ్రుమని నోళ్ళు తెరుస్తున్నట్లు భయం!

వాళ్ళింకా రారేం?

చెమట్లు... ఒకటే ధారలుగా కారుతున్నాయి. ఒకటిక్కూడా ధారాళంగా బయటకు తన్నుకు రావడానికి తయారయిపోతుంది. ఇంతకు తాను ఎవరు? ఇంతకు ముందిట్లా కాలేదేం... ఎవరు.. అవును... తాను గాంధీ... గాంధీ.... కుంచించుకుని... అంగుష్టమాత్రంగా... అమ్మో... భయం... భయం...

భయం!

దూరంగా అట్టహాసంగా బ్యాండుమేళం... డమడమ డప్పుల సప్పుడు.. టమ.... టమ... టమ...జై... జై నాదాలు... ఒకటే సప్పుడు.. కోలాహలం... జనం... భయం... చెమట... అంగుష్ఠం... బొటనవేలు... వామ్మో... దప్పళంగాడు గజగజవణికిపోతున్నాడు. చెమట్లు... భయం... అపుడే వున్నట్లుండి అతిమెల్లగా వాడివెనక గోచీ సదలి.... మెల్లగా వూడిపోవడం మొదలుపెట్టింది.... జర... జర... జర... అరె... అరె... కొండచిలువలా... నెమ్మ... దిగా... అవును... తన శరీరం కుదించుకుపోతుంది... అమ్మో... పొట్టిగా... పీలగా... ఒకటి... రెండంగుళాలు... ఇంకా... ఇంకా... అవును... నడుం పీలపడిపోతుంది. అమ్మో... అరె... పంచెకట్టు...ట్టు... అక్కడ... జర... జర... జారిపోతుంది... అయ్యో... అమ్మో.... జా...రి.... పోతుం...ది... యిం...ది! ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

వ్యక్తి స్వార్థమే కారణం!

భర్త భార్యను, భార్య భర్తను, స్నేహితుడు స్నేహితుణ్ణి, అన్న తమ్ముణ్ణి, తమ్ముడు అన్నను, కొడుకు తండ్రిని, మనుమడు బామ్మను... ఇట్లా ఎన్నో హత్యలను గురించి వింటున్నాం. చదువుతున్నాం! కట్నం తేలేదని హత్య, తాగుతున్నాడని హత్య, అప్పు తీర్చలేదనో, ఇచ్చిన అప్పును అడిగాడనో హత్య. ఆస్తి కోసం హత్య. పాకెట్ మనీ ఇవ్వలేదనో, సినిమాకు డబ్బు ఇవ్వలేదనో హత్య. ఈర్ష్యతో హత్య. కసితో హత్య... ఇట్లా హత్యలెన్నో! ఇక ఆత్మహత్యలకేం తక్కువ లేదు. పరీక్షలో ఫెయిలయ్యాననో, ఫెయిలవుతాననో ఆత్మహత్య. తల్లిదండ్రులు కోప్పడ్డారని ఆత్మహత్య. తండ్రి తల్లికి విడాకులిస్తానని అన్నాడని ఆత్మహత్య. అత్త కోప్పడిందని ఆత్మహత్య. భగ్న ప్రేమికుల ఆత్మహత్యలు! ఇవేగాక ఈ మధ్య మూకుమ్మడి ఆత్మహత్యలు ఎక్కువగా వింటున్నాం. అప్పులయ్యాయనో, వ్యాపారంలో నష్టం వచ్చిందనో మొత్తం కుటుంబం భార్యాభర్తలు, పిల్లలు అందరూ విషం తాగి ఆత్మహత్యలు... బావిలో దూకి ఆత్మహత్యలు'.. ఇదే విషయం చర్చలోకి వస్తే "ఇట్లా హత్య, ఆత్మహత్యలు ఇంతకుముందు వున్నాయంటావా? సుశీ!" అంది లలిత.

"ఎందుకుండవు! వున్నాయి కాని ఇంత సంఖ్యలో లేవేమో! జపాన్‌లో ఆత్మహత్యల రేటు ఎక్కువని ఎక్కడో చదివాన్నేను. కాని ఇప్పుడు చూస్తుంటే హత్యలూ, ఆత్మహత్యల్లో కూడా మన దేశం ముందు నిలిచేటట్లున్నది."

"ఏమో సుశీ! ఈ పత్రికలు వచ్చాక... అందులో ఇంత సంఖ్యలో పత్రికలు వచ్చాక ఈ హత్యల, ఆత్మహత్యల వార్తలు రచ్చకెక్కుతున్నాయేమో అనిపిస్తున్నది" అంది లలిత.

"అది కొంతవరకు నిజమనుకో. ఇన్ని పత్రికలు, టీవీ చానెళ్లు... వాటికీ పేజీలను, టైమ్‌ను నింపేందుకు వార్తలు కావాలి. అందులో న్యూస్ నెట్‌వర్క్ పెరిగింది. వార్తలు అందరికీ అందుతున్నాయి. అప్పటికీ మన దేశం విశాలమైంది. కాబట్టి ఎక్కడ ఏ మూల జరుగుతున్నా ఇటువంటి వార్తలు కనులను, వీనులను ప్రభావితం చేస్తూ వున్నాయి. అప్పటికీ ఎన్నో ఇటువంటి వార్తలు రికార్డు కాకుండా పోతున్నాయి కూడానేమో!" అన్నాన్నేను ఆలోచనలో పడిపోతూ

"ఏది ఏమైనా ఇన్ని హత్యలు, ఆత్మహత్యలు మన సమాజం దుస్థితికి అద్దం పడ్తున్నాయేమోననిపిస్తుందే!" అంది లలిత.

"సమాజంలో ఇటువంటి సంఘటనలు ఎప్పటికీ వుంటాయేమో లల్లీ! కాని ఇటువంటి హత్యలు ఆత్మహత్యలు పెరుగుతున్నాయంటే కారణం వ్యక్తుల్లో పెరుగుతున్న ఆకాంక్షలు, ఒత్తిడులు అని చెప్పాలి..." నా మాటను ముగించకముందే అందుకుంది లలిత.

"నిజమేనే! తలిదండ్రులకు పిల్లలు ఫలానా చదువులు చదవాలని ఆకాంక్షలు! ప్రేమించాలని, పెళ్ళిళ్ళు చేసుకోవాలని యువతలో ఆకాంక్షలు! డబ్బు బాగా సంపాదించాలని ఆకాంక్షలు!.. ఇట్లా ఆకాంక్షలు పెరిగిపోతున్నాయి. వాటితో ఒత్తిడులు! ఆ ఒత్తిడులను తట్టుకోలేక హత్యలు, ఆత్మహత్యలు! – అనిపిస్తుందే నాకు."

"అదే నేను చెప్పేది. ఇంతకు పూర్వం పిల్లలు వాళ్ళకిష్టమున్న కోర్సులు ఎన్నుకొని చదివేవాళ్ళు. ఇప్పుడట్లా కాదు! – ఫలానా కోర్సు చదివితేనే విదేశాలకు పోయే అవకాశముంటుందని అనుకోవడం, విదేశాల మీద, డబ్బు గడించడం మీద ఆశలు! పిల్లలకూ ఫలానా చదువు చదివితేనే భవిష్యత్తు ఉందని అనుకోవడం. ఆ విద్య వల్లనే ఉద్యోగం వస్తుందని ఆ కోర్సుల్లో ఇష్టమున్నా లేకున్నా చేరడం, దాంతో ఆ చదువును చదవలేక ఇష్టం లేకపోవడంతో మనస్సు పెట్టలేక ఒత్తిళ్ళకు గురికావడం జరుగుతున్నది. ఈ ఆకాంక్షలు, ఒత్తిళ్ళు, నిరాశ నిస్పృహలకు గురి చేస్తున్నాయి. దాంతో వాటిని తట్టుకోలేక తమను తాము అంతం చేసుకోవడం కన్పిస్తున్నది" అన్నాన్నేను.

"ఇక డబ్బు వస్తుందనే ఆశతో రైతులు అధిక పెట్టుబడులు అప్పుగా తెచ్చి పెట్టి వ్యాపార పంటలను పండించాలనుకుంటారు. వర్షాలు సహకరించకనో, మరే కారణం చేతనో పంట పండకపోతే నిరాశ నిస్పృహలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మధ్య అప్పుల బాధలను తట్టుకోలేక రైతులు, రైతు కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకోవడం ఎక్కువగా చూస్తున్నాం సుశీ!" అంది లలిత బాధగా.

"కొందరేమో బాగా అభివృద్ధి చెందాలని వ్యాపారంతో డబ్బు సంపాదించాలనే ఆశలతో పెట్టుబడులు పెట్టి అప్పుల పాలై వ్యాపార నష్టాలకు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇట్లా హత్యలు, ఆత్మహత్యల వెనుక ఎన్నో కారణాలనిపించినా అన్నిటి వెనుక ఆకాంక్షలు, ఒత్తిడులే అని తెలుస్తున్నది" అన్నాన్నేను.

"అంటే ఒక్కటే! సుశీ! ఇంతకుముందు ఇంత తొందరగా జనం నిరాశపడే వారు కాదేమో అనిపిస్తుంది. కొంత ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం వుండేదేమో అనిపిస్తుంది. ఇప్పుడు తండ్రి కోప్పడ్డాడనో, అత్త అలిగిందనో కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మనోధైర్యం, ఆత్మబలం ఈ రోజుల్లో తక్కువయ్యాయేమో అనిపిస్తుందే!" అంది లలిత సాలోచనగా. "నిజమే లల్లీ! కాని ఒక్కటి. ఈ హత్యలు, ఆత్మహత్యల వెనుక సామాజికమైన, వ్యక్తిగతమైన ఆకాంక్షలు, ఒత్తిడులు పెరిగిపోవడమే కారణాలు. ఉన్నదాంతో తృప్తిపడడం లేదు. ఇంకా ఇంకా సంపాదించాలనే ఆకాంక్ష ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగంగా పెరిగిపోతున్నది. ఈ వస్తు ప్రపంచంలో ఇంకా ఇంకా ఏదో సాధించాలి, పొందాలి, అనుభవించాలి అనే వ్యక్తి ఆకాంక్షలు పెరిగిపోతున్నాయి. మనిషి మరో మనిషికి తోడ్పడాలి అన్న మానవతా దృక్పథం సమాజాభ్యుదయ ఆకాంక్షల కన్నా వ్యక్తి ఆకాంక్షలు, వ్యక్తి సంపాదనలు ఎక్కువవుతున్నాయి. సమాజం గురించి ఆలోచన పోయి వ్యష్టి స్వార్థం ఎక్కువవుతున్నది. సమిష్టి ఆలోచన కొరవడుతున్నది. పెట్టుబడిదారి వ్యవస్థ వస్తు ప్రపంచ వ్యాపార సంస్కృతి ఇస్తున్న సంస్కృతే ఈ హత్యలు, ఆత్మహత్యలు!" అన్నాన్నేను నా ఆవేదనను వ్యక్తపరుస్తూ. ●

✳ పి.ఎం.సుందరరావు

బాలలకథ

సరైన తీర్పు

సిరిపురం అందమైన గ్రామం. రంగమ్మ, సూరమ్మ ఇరుగుపొరుగువారు. రంగమ్మ మంచి పొదుపరి. ఆమెకు ఒక గేదె వుంది. అది బాగా పాలు ఇస్తుంది. ఆమె ఆ పాలు అమ్ముకుని జీవనం సాగిస్తుంది. సూరమ్మ పెద్ద గయ్యాళి. బాగా దుబారా చేస్తుంది. సూరమ్మ భర్త ఎంత డబ్బు సంపాదించినా, ఒక్క పైసా కూడా మిగల్చకుండా ఖర్చు చేస్తుంది. గుట్టుగా బతుకుతున్న రంగమ్మ అంటే సూరమ్మకు ఒళ్లు మంట. పైగా రంగమ్మ గేదెను కాజేయాలని ఆలోచిస్తుంటుంది.

ఒకరోజు రంగమ్మ గేదె కనిపించకుండా పోయింది. దాంతో ఆమె లబోదిబోమని ఏడవసాగింది. ఆ సమయంలో అదే వీధిలో వుంటున్న కుర్రాడు వచ్చి "మీ గేదె తప్పిపోయి ఊరిబయట తిరుగుతుంటే, ఎవరో మన గ్రామ పెద్ద శివయ్యగారికి అప్ప చెప్పారు. ఇప్పుడది ఆయన దొడ్లో కట్టేసి వుంది. వెళ్లి తెచ్చుకో" అని చెప్పాడు.

అప్పుడు సూరమ్మ కూడా అక్కడే వుంది. ఆ మాటలు ఆలకించింది. రంగమ్మ అదరాబదరాగా శివయ్య ఇంటికి వెళ్లి "అయ్యా! ఆ గేదె నాదే. మీరు దయతలచి ఇస్తే, ఇంటికి తోలుకెళతాను" అని బతిమిలాడింది. అప్పుడే వచ్చిన సూరమ్మ కూడా అలాగే అడిగింది.

శివయ్యకు ఏమీ అర్థంకాలేదు. రంగమ్మ, సూరమ్మ గేదె నాదంటే నాదని వాదులాడుకోసాగారు. వారి మాటలకు కొంతమంది జనం అక్కడ చేరుకున్నారు. సూరమ్మ నోటికి భయపడి నిజం చెప్పకుండా అందరూ చోద్యం చూస్తూ నిలబడ్డారు.

శివయ్య కాసేపు ఆలోచించి, ఇద్దరినీ మరుసటి రోజు రమ్మని పంపించేశాడు. మరుసటి రోజు ఇద్దరూ వెళ్లి శివయ్య ముందు నిలబడ్డారు. ఈ విషయం ఊరంతా తెలిసింది. శివయ్య ఎలాంటి తీర్పు ఇస్తాడోనని అంతా ఆయన ఇంటికి చేరుకున్నారు.

శివయ్య రంగమ్మ, సూరమ్మలను చూసి 'ఇప్పుడు నేను ఒక ముఖ్యమైన ప్రశ్న అడుగుతాను. మీరు చెప్పే జవాబుతో ఆ గేదె స్వంతదారు ఎవరో తెలిసిపోతుంది' అన్నాడు. ఇద్దరూ ఆసక్తిగా చూస్తూ నిలబడ్డారు.

"ఆ గేదె పొదుగు దగ్గర తెల్లటి మచ్చ వుంది. అది ఎవరిదైతే వారు తీసుకెళ్లండి." అని చెప్పాడు శివయ్య. అది విని రంగమ్మ ఏడుస్తూ "శివయ్యగారూ.. నా గేదెకి ఏ మచ్చాలేదు. బహుశా అది మరెవరిదో అయి వుంటుంది. నా గేదె ఎక్కడుందో వెతుక్కుంటాను" అంది.

సూరమ్మ నవ్వుతూ "శివయ్యగారూ! నా గేదెకు మీరు చెప్పినట్టు పొదుగు దగ్గర తెల్ల మచ్చ వుంది. త్వరగా ఇప్పిస్తే తోలుకుపోతాను. ముందు ఆపని చూడరూ" అంది.

ఆ మాటలు విన్న శివయ్య మండిపడి "సూరమ్మా! నువ్వు అబద్ధం ఆడుతున్నావు. నిజానికి ఆ గేదెకు మచ్చలేదు. అది కచ్చితంగా రంగమ్మదే. నీ నోటి దురుసుతో ఆమె గేదెను కాజేయాలనుకున్నావు. కాబట్టి నీకు వంద రూపాయల జరిమానా విధిస్తున్నాను" అని రంగమ్మకు గేదెనిచ్చి పంపించాడు.

ఊరి జనం ముందు పరువు పోయిన సూరమ్మ వంద రూపాయలు కట్టి ఇంటికి వచ్చింది. అప్పటి నుండి గయ్యాళితనాన్ని తగ్గించుకొని, అందరితో మంచిగా మెలగసాగింది. ⬢



క్విజ్ 83కి జవాబులు

1. కౌటిల్యుడు 2. బొద్దింక 3. హెమటాలజీ 4. సివి రామన్ వర్ధంతి 5. భువనేశ్వర్ 6. శాంతి 7. కవి 8. కారల్‌మార్క్స్ 9. శ్రీహరికోట 10. చంద్రిక కుమారతుంగ

క్విజ్ 82కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎం.విజయ, కె. కామేశ్వరరావు, 6వ తరగతి, పాత గాజువాక, విశాఖ. **డి.మౌనిక**, 10వ తరగతి, **డి.మాధవ్**, 8వ తరగతి, సనత్‌నగర్, పాతగాజువాక. **వి.వినాయక్**, 7వ తరగతి, వాయిలాలపల్లి, కరీంనగర్. **పంకజం. జి**, 9వ తరగతి, త్రిసుల్, మెదక్. **పాములపాటి బుచ్చయ్య**, 9వ తరగతి, నిడుబ్రోలు, గుంటూరు. **ఎమ్. విమలశ్రీ**, 6వ తరగతి, సెయింట్ ఆన్స్ హై స్కూల్, చింతలపూడి.

కలం స్నేహం



పేరు: కాకర్ల సాల్మన్ రాజు
వయసు : 13 సం॥
చదువు : 6 వతరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, కబడ్డీ ఆడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : కాకర్ల సాల్మన్ రాజు, చిన్న దోర్నాల, పెద్ద దోర్నాల మండలం, ప్రకాశం - 523331.

పేరు: ఎం. రమేష్,
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : కథలు, పాటలు, రాయడం, డ్రాయింగ్ వేయడం, చదవడం.
పూర్తి చిరునామా : ఎం. రమేష్, సన్నాఫ్ వెంకటేశం, ప్రభురోడ్, జోగిపేట.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు? ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

వెలుగు - నీడ

అక్బర్-బీర్బల్ కథలు

ఓ రోజు అక్బర్ బీర్బల్ ఇద్దరూ కోట బురుజుపై విహరిస్తూ మాట్లాడుకుంటున్నారు. క్రమంగా చీకటిపడింది. అయినా వారు మాట్లాడుకుంటూనే వున్నారు. ఇంకొంతసేపటికి వారు వున్న కోట బురుజు కిందనే రాజభటులు ఒక వ్యక్తిని పట్టుకుని బాగా కొడుతున్నారు. ఆ వ్యక్తి మాత్రం ఏడుస్తున్నాడు.

ఈ కలకలము పాదుషావారి చెవులకు సోకినది. ఆయన బీర్బల్‌తో 'ఏమిటా కలకలము? మనం ఇక్కడ వుండగానే ఆ వ్యక్తిని రాజభటులు దండించుచున్నారు. రాజ భటులకు ఇంత కండకావరమా?' అని ప్రశ్నించాడు.

బీర్బల్ రెండు చేతులు ఎత్తి నమస్కరించి 'ప్రభూ శాంతించాలి. అన్ని చోట్లా ఆవేశము పనికి రాదు. మన భటులు కారణం లేనిది ఎవరినీ దండించరు. మీ సేవకులు అందరూ విశ్వాసపాత్రులే. ఒక మనవి చేస్తాను. చిత్తగించండి. 'వెలుగు కిందనే నీడ కూడా వుంటుంది. వాడు ఏ నేరము చేశాడో. తగిన గుణపాఠం నేర్పుట రాజభటుల కర్తవ్యం కదా' అన్నాడు.

ఆ మాటలు చక్రవర్తికి బాగా నచ్చాయి. సహేతుకంగా హితోపదేశం చేసిన బీర్బల్ చాతుర్యానికి మురిసిపోయి మెచ్చుకున్నారు.

శతాబ్ది మొక్క

చాలా ఏళ్లు జీవించే చెట్ల గురించి విని వుంటాం. కానీ వందేళ్లు జీవించే మొక్క గురించి తెలుసా? అమెరికా ఎడారి మొక్కల జాతుల్లో ఒక మొక్క పేరు శతాబ్ది మొక్క. 'అమెరికన్ ఆలో' అనే మొక్క వందేళ్లు జీవించేదని అనుకునేవారు. ఈ మొక్క వందేళ్లు జీవించదు. కానీ దాని పూలు మాత్రం వందేళ్లకొకసారి వస్తాయంటారు. ఇవన్నీ నిజంకాదని కొందరు అంటారు. ఇవన్నీ నిజాలు కావు. ఈ మొక్కలు చాలా అరుదుగా పూస్తాయి. కొన్ని మొక్కలు పుష్పించిన తర్వాత చనిపోతాయి. కానీ వాటి వేళ్లు మళ్లీ మరుసటి ఏడాది మొక్కగా చిగురిస్తాయి. మెక్సికో ప్రజలు ఈ మొక్క రసం నుంచి పానీయాలు చేస్తారు. ఈ మొక్కల కాండం నుంచి దారాలు, తాళ్లు చేస్తారు. మన దేశంలో కనిపించే 'కలబంద' మొక్కని పోలి వుండే ఈ శతాబ్ది మొక్క శాస్త్రీయ నామం అగేవ్ అమెరికానా.



టి.దుర్గ, 7వ తరగతి,
ప్రగతి బాలవిద్యాలయం,
సుందరయ్య నగర్, తాడేపల్లి.

పిట్టల. మనీష్‌కుమార్,
5వ తరగతి, ఖమ్మం.

చిన్నారి చిత్రకారులు



పి.లుష్మిప్ప, 6వ తరగతి,
గీతాంజలి హైస్కూల్,
చిక్కడపల్లి, హైదరాబాదు.



బి.సృజన, 6వ తరగతి,
గీతాంజలి హైస్కూల్,
చిక్కడపల్లి, హైదరాబాదు.

క్విజ్-84

1. గొప్ప గాయని?
   ఎ. లతా మంగేష్కర్ బి. నర్గీస్
2. 'ఎడారిఓడ' అని దేనిని అంటాం?
   ఎ. గుర్రం బి. ఒంటె
3. అజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసినది?
   ఎ.నేతాజీ బి. చాచాజీ
4. 'మొనాలిసా' బొమ్మ వేసినదెవరు?
   ఎ. లియొనార్డో డావిన్సీ బి. పికాసో
5. గాంధీజీని 'మహాత్మా' అని మొదటిసారిగా పిలిచినదెవరు?
   ఎ. రవీంద్రనాథ్ ఠాగూర్ బి. నెల్సన్‌మండేలా
6. విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రము ఎక్కడ వుంది?
   ఎ.తిరువనంతపురం బి. బెంగుళూరు
7. మేడమ్ క్యూరీ గొప్ప...?
   ఎ.శాస్త్రవేత్త బి. భాషాకోవిదురాలు
8. ఉష్ణమును ఏ విధంగా కొలుస్తారు ?
   ఎ.సెల్సియస్
   బి.కేలరీ
9. 'ఇండికా' గ్రంథ రచయిత?
   ఎ.మెగస్తనీస్
   బి.మార్కోపోలో
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?
    ఎ.రమణ
    బి.బాపు



బడాయిపిండే!

హాయ్! ఈ వారం మీకు వెరైటీ మేజిక్ గురించి చెప్దామనుకుంటున్నా. చెప్పమంటారా? అబ్బా... మీరు అడగంగానే చెప్పేస్తానేంటి? ముందు మీరు బాలనేస్తాలు పేజీ అంతా చదివారో లేదో చెప్పండి. చదివాం అంటేనే... మేజిక్ గురించి చెప్తా. ఓకే... ఎక్కువ మంది చిన్నారులు 'చదివాం' అంటున్నారు కాబట్టి చెప్తా. జాగ్రత్తగా చదవండే.

ఇదిగో ఈ పక్కన ఓ టోపీవాలా తల వుంది. చూశారుగా. గళ్ల టోపీ పెట్టుకుని విచిత్రంగా నవ్వుతున్నాడు. పైగా టోపీకి ఒక పువ్వు కూడా పెట్టుకున్నాడు. ఇతనికి కాస్త బడాయి ఎక్కువ. అందుకే విచిత్రంగా తయారవుతుంటాడు.

మేజిక్ మేజిక్!!

ఎంత బడాయిపిండే అయితే మాత్రం మనకేమన్నా భయమా ఏంటి? ఒక మంత్రం చదివానంటే అతని తల కింద తల మొలుస్తుంది. అప్పుడు బడాయి వదిలిపోతుంది. 'ఔనా' అంటున్నారేంటి? నిజమే. కావాలంటే మంత్రం వేస్తున్నా జాగ్రత్తగా చూడండి అబ్రకదబ్రా...అబ్రకదబ్రా... టోపీవాలా తల కింద తల రావాలి దబ్రా... అబ్రకదబ్రా...అబ్రకదబ్రా. ఇప్పుడు చూడండి... తల కింద తల కనిపించిందా... ఏంటి అలా చూస్తున్నారు? కావలంటే పుస్తకం తిరగేసి చూడండి. ఆ... ఇప్పుడు కనపడిందా. మరి అదే మనమంటే...!

కానీ కొందరు నేస్తాలు ఆ మంత్రం పూర్తిగా చెప్పమని అడుగుతున్నారు. మీరంతా అడిగాక కాదంటానా? మరేం లేదర్రా...! మంత్రం తంత్రం ఏంలేదు. మంత్రం వెయ్యకుండానే పుస్తకం తిరగతిప్పి చూసినా తలకింద తల కనిపిస్తుంది. ఇదంతా ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. అంతే. కాకపోతే మీ మిత్రులకు మాత్రం ఆ విషయం చెప్పమాకండి. మీరేదో మంత్రం వేసినట్టు, రెండో తల మొలిచినట్టు గొప్పలుపోవాలికదా. కానీ కొద్ది రోజులు పోయాక మాత్రం అసలు సంగతి చెప్పేయండే.

రంగులు అద్దుతారా!



రియల్ స్టోరీ

* పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

కనిపించని దేవుడు

సీతాదేవి

అర్ధరాత్రి...

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటిలో బహదూర్ విధి నిర్వహణ చేస్తున్నాడు. ఒక చేతిలో లాఠీ మరో చేతిలో టార్చిలైటు, జేబులో విజిలు.. గూర్ఖా అవతారంలో కాలనీ అంతా తిరుగుతున్నాడు.

దొంగలు ఎవరూ రాకుండా కాపలా కాయడానికి ప్రతి గృహస్తుడి నుంచి నెలకు పది, పదిహేను రూపాయలు వసూలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు.

రోజూ రాత్రి 11 గంటలకు అతని విధి నిర్వహణ మొదలై ఏ తెల్లవారుఝామునో ముగుస్తుంది.

ఇంటింటికి తిరిగి విజిల్ వేస్తుంటాడు. అనుమానంగా ఎవరైనా కనిపిస్తే ఆపి వివరాలు అడుగుతుంటాడు. ఏ ఇంటిలో అయినా లైట్లు వెలుగుతుంటే తలుపుతట్టి దొంగలు కాదని నిర్ధారించుకుంటాడు.

విశాఖ జిల్లా గోపాలపట్నం, వేపగుంట ప్రాంత కాలనీ వాసులకు బహదూర్ చిరపరిచితుడు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరిలో ఒకడిగా కలిసిపోయాడు.

సెకండ్‌షో సినిమా వదిలి చాలాసేపు కావడంతో జన సంచారం తగ్గిపోయింది.

బహదూర్ సిగిరెట్టు వెలిగించాడు.

రెండు దమ్ములు లాగాడో లేదో గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది. మూసిన షాపు అరుగుమీద చతికిల పడిపోయాడు.

అరవయ్యేళ్ళ అతని శరీరం భయంతో వణికింది.

గతంలో రెండుసార్లు ఇటువంటి నొప్పి వచ్చింది. పెద్దగా ఏం కాలేదు. ఈసారి కూడా అలా తగ్గిపోతుందని అనుకున్నాడు. తగ్గిపోవాలని మనసులో ప్రార్థనలు మొదలు పెట్టాడు.

నొప్పి క్రమంగా ఎక్కువైంది.

నెమ్మదిగా నడుచుకుని గోపాలపట్నం రైతు బజారు వరకూ వచ్చాడు. మనుషుల అలికిడి లేదు. ఎందుకైనా మంచిదని అతి కష్టం మీద విజిల్ వేశాడు. అయినా ఏ స్పందనా రాలేదు.

మృత్యువు సమీపిస్తున్నట్లు బహదూర్ మనసు హెచ్చరిక చేస్తోంది. శరీరం గాలిలో తేలి పోయినట్లు అనిపిస్తోంది.

బహదూర్‌కు తన భార్య సీతాదేవి గుర్తుకు వచ్చింది. శరీరం ఎదిగినా, ఎదగని మనసు గుర్తుకు వచ్చింది. ఒకరికొకరు ప్రాణంగా ఉంటూ రోజూ తను ఆమెకు చేసే సపర్యలు గుర్తుకు వచ్చాయి. తను లేకపోతే ఆమె ఏమైపోతుందా అన్న ఆలోచన బహదూర్ హృదయంలో సుళ్ళు తిరిగింది. కళ్ళు మగతకమ్మాయి. క్రమంగా కిందకి వాలిపోయి దబ్బున పడ్డాడు.

బహదూర్ ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

* * *

నేపాల్‌కు చెందిన మదన్ బహదూర్ ముప్పయి ఏళ్ళ క్రితం భార్య సీతాదేవితో విశాఖపట్నం వలస వచ్చాడు. చిన్న ఇంటిలో కాపురం పెట్టాడు.

షిప్‌యార్డులో గార్డు ఉద్యోగంలో చేరాడు.

భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యం చాలాకాలం కొనసాగింది. ఒకరికి ఒకరు తోడుగా జీవనం సాగించేవారు.

1995లో జరిగిన చిన్న ప్రమాదంలో సీతాదేవి మతిస్థిమితం కోల్పోయింది. ఎవరినీ గుర్తించలేని స్థితిలోకి వెళ్ళిపోయింది. నేపాల్‌లో ఆమె పుట్టింటిలో వదిలిపెట్టమని చాలామంది సలహా ఇచ్చారు.

దాంపత్య బంధంలో ఆమెతో పెనవేసుకున్న అనుబంధం మధ్య బహదూర్‌ను ఆ పని చేయనివ్వలేదు. జీవితాంతం తోడుంటానని పెళ్లినాడు చేసుకున్న ప్రమాణాలు నిలబెట్టుకోవాలని నిశ్చయించుకున్నాడు. పిల్లలు లేకపోవడంతో ఆమెకు అన్నీ తానై సపర్యలు మొదలు పెట్టాడు.

స్నానం చేయించడం, బట్టలు మార్చడం, భోజనం తినిపించడం వంటి పనులన్నీ చేసి ఇంటిలో తాళం వేసి గార్డు డ్యూటీకి వెళ్ళిపోయేవాడు. సాయంత్రమెప్పుడో వచ్చే భర్తకోసం పిచ్చి చూపులు చూస్తూ సీతాదేవి ఎదురు చూసేది.

తాను దగ్గర లేకపోతే మరీ వంటరిది అయిపోతుందని బహదూర్ బాధపడేవాడు. తన కుటుంబం విషయం పక్క ఇంటివారికి కూడా తెలియకుండా జాగ్రత్త పడేవాడు.

ఆ సమయంలో షిప్‌యార్డ్ కల్పించిన స్వచ్ఛంద పదవీ విరమణను ఉపయోగించుకున్నాడు. గార్డు ఉద్యోగం నుండి వైదొలిగాడు. పగలంతా భార్యకు సేవలు చేస్తూ ఆమె పడుకున్న తర్వాత గూర్ఖా ఉద్యోగానికి బయలుదేరేవాడు.

ఎవరికీ తెలియని అన్యోన్య దాంపత్యం వృద్ధాప్యంలో కూడా సాఫీగా సాగిపోయేది.

బహదూర్ మృతి వారి జీవనాన్ని విచ్ఛిన్నం చేసింది. అంతవరకూ మతిస్థిమితం లేని భార్యను

బహదూర్‌కు తన భార్య సీతాదేవి గుర్తుకు వచ్చింది. శరీరం ఎదిగినా, ఎదగని మనసు ఆమెది. ఒకరికొకరు ప్రాణంగా ఉంటూ రోజూ తను ఆమెకు చేసే సపర్యలు గుర్తుకు వచ్చాయి. తను లేకపోతే ఆమె ఏమైపోతుందా అన్న ఆలోచన బహదూర్ హృదయంలో సుళ్ళు తిరిగింది. కళ్ళు మగతకమ్మాయి. క్రమంగా కిందకి వాలిపోయి దబ్బున పడ్డాడు.

బహదూర్ ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

గుట్టుగా సంరక్షిస్తున్న విషయం బైటపడింది.

తన సహచరుడు కనిపించకపోవడంతో సీతాదేవి తల్లడిల్లిపోయింది. మతిలేని హృదయం పిచ్చిగా రోదించింది.

* * *

మదన్ బహదూర్ మరణవార్త చెప్పడానికి అతని ఇంటికి వెళ్ళి పరిస్థితిని చూసిన స్థానికులు ఆమె ఒంటరి జీవితానికి మార్గం చూడాలని నిర్ణయించుకున్నారు. స్వచ్ఛంద సేవకుల్ని సంప్రదించారు.

"సీతాదేవిని మేము ఆదుకుంటాం. అనాధ మహిళగా ఆమె బాధ్యతను మేము స్వీకరిస్తాం..." జనపాల సంజీవరావు ముందుకు వచ్చారు.

"ఈమెకు మతిస్థిమితం లేదు... భర్తలేని ఒంటరి మనిషి..." స్థానికులు చెప్పారు.

"వరలక్ష్మీనగర్‌లో నిత్యాన్నదాన పథకాన్ని నిర్వహిస్తున్న మాకు ఈమెను పోషించడం కష్టం కాదు. ఈమె మానసిక పరిస్థితి అంటారా అది మా చేతిలో లేదు..."

స్థానిక పోలీసులు, మైత్రీ సంఘం సభ్యులు ముందుగా ఆమెను విశాఖపట్నం మానసిక చికిత్సాలయానికి పంపించాలని నిర్ణయించుకున్నారు. కాస్త కోలుకున్న తర్వాత జీవితాంతం ఆమె పోషణ భారం సంజీవరావుకు చెందిన ట్రస్టుకు అప్పగించాలని అనుకున్నారు.

ఆమెను మానసిక చికిత్సాలయానికి పంపించారు.

వైద్యులు కూడా ఆమె పరిస్థితికి చలించిపోయారు.

దేశం కాని దేశంలో ఒంటరితనం, మానసిక వైకల్యంతో వున్న ఆ నేపాలీ వృద్ధురాలు అందరి హృదయాలను కదిలించి వేసింది.

ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించారు.

ఆమె కేసును కొత్తకోణంలో చూశారు.

ఆరు నెలల్లో పరిస్థితిలో మార్పు వచ్చింది. మనుషుల్ని గుర్తించగలుగుతోంది. తన పనులను తాను చేసుకోగలుగుతోంది. వచ్చీరానీ తెలుగులో చిన్నచిన్న మాటలు మాట్లాడుతోంది... "ఈమెను ఆత్మీయుల తోడు ఉండాలి... అప్పుడు మరింత కోలుకుంటుంది--" వైద్యులు చెప్పారు.

-ఇచ్చిన హామీ మేరకు జనపాల సంజీవరావు నేపాలీ మహిళను తన ఇంటికి తీసుకువచ్చారు. తన ఇంటిలో ఓ మూల గదిని ఆమె కోసం కేటాయించారు. ఆమె ఆలనా పాలనా చూడటానికి మనుషుల్ని నియమించారు. తాను నిరుపేదలకు నిత్యం నిర్వహించే నిత్యాన్నదాన పథకం ద్వారా సీతాదేవి తిండికి ఏ లోటూ లేకుండా ఏర్పాటు చేశారు.

సీతాదేవి సంజీవరావు కుటుంబంలో ఒక సభ్యురాలు అయిపోయింది. వారు కూడా ఆమెను తమలో ఒకరిగా కలుపుకున్నారు.



సంజీవరావు కుటుంబ సభ్యులతో సీతాదేవి

* * *

సాయం సంధ్య.

సంజీవరావు ఇంటిలో పూల మొక్కల మధ్య సిమెంట్ బల్లమీద సీతాదేవి ఒంటరిగా కూర్చుంది. ఆమె చూపులు ఆకాశంలో శూన్యంలోకి చూస్తున్నాయి. మొహంలో విషాదం గూడుకట్టుకుంది.

చేతిలో ఎప్పటిదో మదన్ బహదూర్ ఫొటో.

ఫొటోను చూస్తుంటే ఆమె కళ్ళు నీటితో నిండిపోతున్నాయి. ముడతలు పడ్డ మొహంలో దుఃఖం దోబూచులాడుతోంది.

"బాధపడుతున్నావా?" పక్కకు వచ్చి సంజీవరావు ప్రశ్నించాడు.

సీతాదేవి ఆ ఫొటోను చీరకొంగులో దాచుకుని కన్నీళ్ళను తుడుచుకుంది. గాభరాగా లేచి నిల్చుంది.

సంజీవరావుకు ఒక్కసారి జాలి కలిగింది.

"కూర్చోండి... బహదూర్ లేకపోయినా మేమంతా ఉన్నాం... మీకు ఏ కష్టం లేకుండా చూసుకుంటాం... నేపాల్ వెళతానంటే అడ్రసు చెప్పండి.. పంపిస్తాం... బాధపడొద్దు.. నిశ్చింతగా ఉండండి.. ఏం కావాలన్నా మొహమాటం లేకుండా అడగండి..."

"నేపాల్... ఎప్పుడో మరిచిపోయాను. ఎక్కడికీ వెళ్ళను.. తిని కూర్చోవడం ఇష్టం ఉండటం లేదు... నేనూ ఏదో పని చేసి మీకు సాయపడతాను... మీ సాయాన్ని... మంచితనాన్ని మరిచిపోలేను..." మెల్లగా వచ్చీరాని తెలుగులో చెప్పింది.

"అలాగే... వంటవాళ్ళను పనులకు పురమాయించే బాధ్యత తీసుకోండి.. కష్టపడటంలో ఆనందం నిజంగా గొప్పది.."

"అన్నా.."

సంజీవరావుకు ఆ పిలుపు హృదయానికి తగిలింది. సీతాదేవి మీద ప్రేమ, జాలి రెట్టింపు అయ్యాయి. ఓ క్షణం మాట రాలేదు..

"బహదూర్ లేరు... ఆయన జ్ఞాపకాలున్నాయి. నాకు జ్ఞానం లేనప్పుడు నాకు ఎన్నో సేవలు చేశారు. అవన్నీ మరిచిపోలేకపోతున్నాను. పాడైన ఈ ఫొటో పెద్దది చేసి ఫ్రేము కట్టి ఇవ్వవూ..." సీతాదేవి అభ్యర్థించింది.

సంజీవరావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆ ఫొటోను అందుకున్నాడు. ఆ మర్నాడు. పెద్ద సైజు చేయించి ఫ్రేము కట్టించాడు. వెలిగి ఆరే బల్బులను అమర్చాడు. సీతాదేవి ఉంటున్న గది గోడకు తగిలించాడు. తర్వాత ఆమెను పిలిచి చూపించాడు.

గోడమీద ఫొటో చూసి సీతాదేవి స్థాణువైపోయింది. ఏడుపు ఆగలేదు. ఫొటోకి దణ్ణం పెట్టి నేలమీద కూర్చుండిపోయింది. తనివి తీరా దుఃఖించినంత వరకూ సంజీవరావుగానీ ఆయన కుటుంబ సభ్యులుగాని ఏమీ మాట్లాడలేదు.

"భార్యాభర్తల అనుబంధం ఇంత గొప్పదా? ఆత్మీయత అనురాగాలు... మనిషి లేకపోయినా నిలిచి ఉంటాయా?" అనుకున్నాడు.

తర్వాత నెమ్మదిగా లేచింది సీతాదేవి.

"బాగుందా?"

"ఆమె ఓ క్షణం ఏమీ మాట్లాడలేదు...

"ఆయన కనిపించని భగవంతుడు... మీరు ఎదురుగా కనిపిస్తున్న దేముడు... అంతే..." సీతాదేవి గొంతు పెగల్లేదు. బహదూర్ ఫొటోను, తననూ మార్చి మార్చి దణ్ణం పెడుతున్న ఆమెను అలా చూస్తూండి పోయాడు.

●

✻ లక్ష్మి

తల్లీ నిన్ను తలంచి...

తెలుగు పదాల గురించి -

క్లాసు తీసుకోడం లేదు! భయపడకండి!

తెలుగులో అక్షరాలెన్ని అనిగానీ-

తెలుగును అజంతా భాషగా ఎందుకు పిలుస్తారనిగానీ-

మిమ్మల్ని అడగడం లేదు. బెదిరిపోకండి. ఆ మాటకొస్తే - నాక్కూడా అంతంతమాత్రపు తెలుగే వచ్చు! అంతమాత్రాన మిగతా భాషల్లో చెలరేగిపోతానని అపార్థం చేసుకోవద్దు!

నాకేం కావాలో సులువుగా చెప్పుకునేందుకు నన్ను తెలుగు భాషే ఆదుకుంటూ వుంటుంది! ఆ విషయం నాకు బాగా తెలుసు!

ఇంగ్లీషు-నాలాంటి వారికి కేవలం డాబుసరి భాష!

ఈ విషయం కూడా నాకు బాగానే తెలుసు!

డాబుగా లేకపోతే నన్ను చిన్న చూపు చూస్తారేమోనన్న భయంతో-అవసరార్థం నానోటికొచ్చిన ఇంగ్లీషు పదాల్ని ప్రయోగిస్తుంటాను!

ఇదేదో నా సొంత గాథ అనుకోవద్దు!

నాలాంటి ఇల్లాళ్ళు చాలా మంది వున్నారు. డాబుసరి పేరంటానికి వెళ్ళినప్పుడు - అక్కడ నాలాంటి వాళ్ళని మీరు చాలా మందిని చూసే వుంటారు! వదిలేయండి! నేనిప్పుడు తెలుగు వాడకం గురించి చెప్పబోవడం లేదు. అమ్మ గురించి మాత్రమే చెప్పాలనుకుంటున్నాను!

అమ్మకీ భాషకీ లింకేమిటని ఆశ్చర్యపోవద్దు! అదంతే!

మా అమ్మ చాలా కాలం క్రితమే కాలం చేసింది. అమ్మలందరూ మంచి వాళ్ళే! మా అమ్మ మరింత మంచిది! ఆమె పోయిన తొలి రోజుల్లో తరచూ కల్లో కనిపించేది! ఆ తర్వాత మెల్లిమెల్లిగా కనిపించడం మానుకుంది!

అమ్మ బొమ్మ ఇప్పటిక్కూడా బాగా గుర్తుంది! అంచేత అమ్మ కల్లో కనిపించకపోయినా నా మదిలో మెదిలే అమ్మ బొమ్మతో తృప్తి పడుతున్నాను!

అల్లాంటిది-

చాలా కాలం తర్వాత మళ్ళీ మొన్నీ మధ్య కల్లో కనిపించింది! ఎన్నో ఏళ్ళకి మళ్ళీ కనిపించిన అమ్మను డాబుసరిగా ఇంగ్లీషులో పలకరించేను!

ముదనష్టపు పలకరింపు!

నా ఇంగ్లీషు పలకరింపు మా అమ్మను ఏడిపించింది!

ఆ దెబ్బతో భళ్ళున తెల్లారిపోయింది!

కల్లో కనిపించిన తల్లిని ఇంగ్లీషులో పలకరించి ఏడిపించి పాపం మూటకట్టుకున్నందుకు చింతిస్తూ - ఆ పాప పరిహారార్థం - అమ్మ గురించి నాలుగు ముక్కలు రాసుకుంటున్నాను. చిత్తగించండి!

తమ పెదాలు రెండూ కలవకుండా - అమ్మ అనే పదాన్ని పలకండి చూద్దాం! ఆ పని తమ వల్ల కాదు. పట్టుదలతో ప్రయత్నించి, పలికినా - పిచ్చి పిచ్చి శబ్దాలొస్తాయే గాని అమ్మ రాదు. అంచేత ఏమిటంటే అమ్మ అనే పదంలో ఒక కలుపుగోలుతనముంది. గుండెను కుదిపే గుణముంది. దెబ్బనాకు తగిలినా మీకు తగిలినా మీరూ నేను వెంటనే అమ్మా అనే అంటాం. అంటే -వ్యవహారం డేంజర్లో పడినప్పుడు - ఆదుకునే మొదటి వ్యక్తి అమ్మ! అందుకే దెబ్బ తగిలినప్పుడు అమ్మా అంటామే గానీ - నాన్నా అనలేం! అక్కా చెల్లీ అని కూడా అనలేం! అమ్మ అనే పదం తాలూకు రెండక్షరాల్లో కొండంత ఓదార్పుంది. నేనున్నానుకన్నా నీకేం ఫర్లేదనే హామీ వుంది. అంచేత మనకి తెలీకుండానే అమ్మా అని అనేస్తాం!

పసి వెధవ నేర్చుకునే తొలిమాట అమ్మ! దేవుడనే వాడు వున్నాడో లేడో తెలీదు. అమ్మలేని వాడు మహిలో లేడని చెబుతారు. అమ్మలేనిదే నేను లేను. తమరు కూడా లేరు. సర్వజనాభాయే వుండదు. పసివాడి భాష అమ్మకే బాగా తెలుసు! ఉంగా ఉక్కా అంటూ బోలెడు ఖబుర్లు చెబుతాడు. ఉంగకీ ఉక్కకీ ప్రత్యేకించి అర్థాలున్నాయి! అవి బిడ్డబిడ్డకీ మారుతుంటాయి! ఆ భాష ఆ గొడవ సమస్తం తల్లికే తెలుస్తుంది. వాడి ఆకలి తెలుసు. వాడి అవసరం తెలుసు. వాడి అవస్థ తెలుసు. వాడి బాగుకోసం బంగారు భవిష్యత్తు కోసం ఆరాట పడుతుంది. అవసరమొస్తే బిడ్డకోసం ప్రాణత్యాగం చేసే తెగువ అమ్మకే వుంటుంది. నా చిన్నప్పుడు 'సర్వర్ సుందరం' అనే సినీమా చూసేను. ఆ సినీమాలో తల్లి అనే మాటకి చక్కటి నిర్వచనం చెప్పేడు దర్శకుడు!

కోడి వయసులో వున్న కొడుకు వగలాడినెవర్తినో ప్రేమించేడు. ఏవి కావాలో కోరుకోమన్నాడు. నీ తల్లి గుండెను పట్టుకురమ్మంది వగలాడి. ఆ దౌర్భాగ్యుడు ఓసంతే కదా అన్నాడు. తల్లిని - గుండె కోసియివ్వమన్నాడు. ఎంతైనా అమ్మకదా... బిడ్డ ఆనందం కోసం బతికే దేవత కదా... అంచేత ఆ మూర్ఖుడి కోరికను కాదనలేకపోయింది. వాడు ఆ తల్లి గుండెను చేతుల్తో పట్టుకుని వగలాడి దగ్గరికి పరుగెత్తుతుంటే - అతని చేతుల్లో వున్న తల్లి గుండె "నాయనా భద్రం! పరుగెత్తకు! ఆ పరుగులో కాలికేదైనా తగిలితే పడిపోతావు! దెబ్బతగుల్తుంది! భద్రం చిట్టీ" అన్నదిట! అదీ అమ్మ!

అల్లాంటి అమ్మ ఒక స్త్రీ మూర్తి!

అందువల్ల సహనానికి పెద్ద దిక్కు!

వరాలిచ్చి ఆదుకునే కల్పతరువు అమ్మ. చివరి అంకంలో తల్లులందరూ తమ బిడ్డల సేవల్తో సుఖపడతారనే గ్యారంటీ లేదు. ఏడంతస్తుల మేడలో కొందరుంటాదిరి. పరమపాత పెంకుటింట్లో మరి కొందరుంటారు. అంత పెద్ద మేడలో ఏదోమూల పాత చెప్పు పారేసినట్టు మేడలో తల్లికి చోటు దొరికితే - పెంకుటింటో అందరి మధ్య ఒక చిన్న నులక మంచం ఈ తల్లికి హంస తూలికా తల్పమవుతుంది! పెంచి పెద్ద చేసినందుకు బిడ్డ నుండి ఏ తల్లీ ప్రతిఫలం కోరుకోదు - అతని గుండెల్లో స్థానం తప్ప! ఆ స్థానం కూడా లోపించిన నాడు ఆమె బాధ వర్ణనాతీతం! తల్లిని బాధపెట్టిన మనిషికి పుట్టగతులుండవని శాస్త్రం చెబుతోంది. తర్వాత మీ ఇష్టం! ●

బిందు సేద్యం - చిందులే చిందులు

"అరె... అరరె... ఏందిదీ... అదేం సరసం... నీకే... ఓర్నీ... స్నానం చేయాల్నంటే - అట్ల వేళ్ళతోని నీళ్ళు చిమ్ముతావేంది?" జక్కులోడు చిందులేస్తూ అరిచాడు. వాడి భార్య బహుకొంటెగా... చేతికందకుండా... బిందెలోని నీళ్ళను అయిదు వేళ్ళలో చిలకరిస్తూ చిందులేస్తోంది.

"ఇదేం పనే... ఒళ్ళు చరచర లాడిపోతుంది... సాలుగానీ ఆ బిందె అక్కడ పెట్టు... చెంబుతే...!" జక్కులోడు చొక్కా బనీను విప్పాడు. భార్య బిందె పక్కన పెట్టి మూతి మూడు వంకర్లు తిప్పింది.

"సోద్యం... స్నానం అంటే చెంబూ తపేలా అందుకుని బుడ బుడ ఒంటిమీద గుమ్మరిచ్చుకోడమేనా ఏంది? అసలు స్నానం చెయ్యడం అట్ల కాదు...!"

జక్కులోడు నివ్వెర పడిపోయాడు. చేతిలోని చెంబుజారి బిందెలో పడిపోయింది. "మరేందీ... ఈ మొత్తం బట్టలూడదీసుకుని చెయ్యాల్నా... రోజూ చేస్తున్నది చెంబూ... తపేలాతోనేగదా...

"ఛ... ఛ... అదేం స్నానం.. ఇట్లా తుంపర్లు తుంపర్లుగా... వాన చినుకులు పడవు.. అట్ల ఒంటిమీద పడుతుంటె చేసేది అసలు స్నానం..." ఆవిడ మళ్ళా కిలకిల నవ్వింది. జక్కులోడు వుడుక్కుని లొడలొడ స్నానం కానిచ్చి ఇంట్లోకి వచ్చాడు.

"బిందు.. తుంపర్లు... స్నానం... ఈ రోజు కొత్త మాటలు... ఏంది కథ?" జక్కులోడు మటమటలాడుతూ అన్నాడు.

"నీళ్ళను చాలా జాగ్రత్తగా వాడుకోవాలె... పొదుపు... పొదుపు..

"జాగర్తంటె... అస్సలు ముడ్డీ... మూతీ కడుక్కోకుండా వుంటె మరింత పొదుపై పోతుంది గదా... చోద్యం.... తాగడానికే దొరకటం లేదురా అని జనం గోలకు తగులుకుంటుంటే నువు మళ్ళా అందులో పొదుపంటావ్... ఏంది?"

"ఏందో... నీకేం తెలుసు... అవతల గవర్మెంటు రైతులకు గదేదో బిందు సేద్యం... స్ప్రింకర్లు డ్రిప్పులు అని అంటలేే...!" భార్య విసుక్కుంటూ అనేసి పొయ్యిదగ్గర కూలబడింది. జక్కులోడు ఎటూ అర్థంగాక చెప్పులు తగిలించుకుని బజార్న పడ్డాడు!

* * *

ఊరంతా కలకలంగా వుంది. కాస్తో కూస్తో యవసాయం - దీనికి సంబంధించి పనులు చేసే వ్యవసాయ కూలీలు... జీతగాండ్లు... రెండు మూడెకరాలున్న చిన్న రైతులు చిందులు తొక్కుతున్నారు. అందర్లోనూ ఉత్సాహం... వూరికే వుద్రేకపడి రెచ్చిపోతున్నారు.

"మావా... మనం ఇంతకాలం నుండి నీళ్ళను 'వేస్టు' చేసుకుంటున్నం.... ఎక్కడబడితే అక్కడ అవసరం లేని చోటల్లా నీళ్ళొదిలి చాలా నాశనమై పోయినం.." నర్సింహ ముసలి గురివిగాడితో అన్నాడు. వాడికి వళ్ళు మండిపోయినట్లయింది.

"పగిలిపోయింది - వేస్టు... పాస్టు... అస్సలు నీళ్ళు వేస్టు చేయడానికి గవి యాడున్నయని. వాన వచ్చినా చెర్వులు పూడకపాయె - అదంత పైన కరకట్టలని... వాటర్ షెడ్లని అడ్డం కట్టలు కట్టి... అడ్డగోలుగా దబ్బులన్ని ఆగంజేసి - జేబు తీసుకునిరి. థు...!" కాండ్రించి వుమ్మాడు. నర్సింహ బిత్తరపోయాడు.

"అది కాదెమావా... వాననీళ్ళు పడ్డాయనుకో... అహఁ... ఉన్న నీళ్ళన్నింటినీ మొక్కలకు... వాటి కుదుల్లకు సరిగ్గ అందించాలెగద!"

"యహె.. ముందు నీళ్ళు దొరికే సంగతి చూడమంటె కుదుళ్ళని మెదళ్ళు ఖరాబు చేస్తవ్. ఏ కాలవలు సరిగ్గ లేకపాయె. ఒక్కటంటె ఒక్క ప్రాజెక్టు గట్టకపోతే, సంకనాకి గోదారి నీళ్ళన్ని వుత్తంగనె పోయి సముద్రంల కలిసిపోతుండె! గవి వేస్టుగద! పెట్టుకునే నీళ్ళు వేస్టన్న మాట!"

ఆ దెబ్బకు నర్సింహ తోక కాలిన పిల్లిలా రెండు గెంతులు గెంతి అక్కడ్నుంచి జారుకున్నాడు. అవాళ వెంకట్రావుడి భూమిలో 'బిందుసేద్యం' అట్టహాసంగా మంత్రిగారు ప్రారంభం చేసినారు. అబ్బో... దాని గురించి జనాలు ఒకటే కథలు కథలుగా చెప్పుకోడంతో వెంకట్రావుడికిక పట్టపగ్గాలు లేకుండా పోయి చప్టాదగ్గిర ఒకటే గొప్పలు పోతున్నాడు.

"అరే యాద్గిరీ... నావి మొత్తం రెండెకరాలుగద... అస్సలు బీడు అయిపాయె... ఏం పంట పండి సావట్లేదాయె.. ఏదో చెంద్రబాబుగారి చలవవల్ల నా భూమిల నాలుగు మొక్కలేసి ఇంత 'ఫలసాయం' పొందడానికి వీలయ్యింది. మన మంత్రిగారు ధర్మరాజొరె! దగ్గరుండి పూజలు జేసి 'డ్రిప్' స్విచ్చినొక్కి మొదలు పెట్టిండు.

"అస్సలు దాని మతలబేందిరా... పూరాగా మాకు సమజ్ కాడం లేదు. అది ఎట్లా... ఏం జేస్తరు ఎట్లా పని చేస్తది.." మల్లేశు బహు ఆసక్తిగా లొట్టలేస్తూ అడిగాడు.

"ఒరే... ఇది ఇజ్రేలుగాడి టెక్నాల్జీ... మన బాబుగారు అంతదూరం పోయి అయిదారు వారాలుండి దాన్ని మొత్తం సొయంగా చేసి వచ్చి మనకు మొదలు పెట్టింద్రు! దాన్లో సూత్రం ఏంటంటే... మన మొక్కలకు నీళ్ళు వృధాకాకుండా దాని వేర్లు పీల్చుకునేటట్లు ఏర్పాట్లు చేసుకోడం... వానలు పడ్డట్టు పై నుండి సన్నని నీళ్ళు తుంపర్లుగా వెదజల్లడం.. సరిపోంగానే స్విచ్ లటుక్కున ఆపు చేస్తే టక్కున ఆగి మనకు చాలా నీళ్ళు ఆదా అయిపోతాయన్నమాట!"

"యహె... నీ భూవి సంగతి చెప్పరాదుర..." యాద్గిరి బీడీ వెలిగించి రెండు పీకులు పీకి ఈసడించాడు. వెంకట్రావుడు రుసరుసలాడి లొటలొట తగులుకున్నాడు. 'ఏంలేదుర.. మొత్తం మన యమ్మెల్లేగారు సొయంగా కాంట్రాక్టు తీసుకుని పాతిక వేలకు కుదిరిచ్చిండు. దాన్లో సగం బ్యాంకులోను... పావలా వంతు సబ్సిడీ కింద బాబుగారే ఇస్తున్నారాయె... పైపులు పెట్టినం.. ఒరే యాద్గిరీ... యవసాయం శాఖ వాండ్లు ఉచితంగా ఎకరానికి వెయ్యి మొక్కల చొప్పున రెండెకరాలకు రెండు వేల మొక్కల్ని వాండ్లే తెచ్చిపెట్టింద్రు గద... ఆ మొక్కలు పెరిగినంక మొత్తం దబ్బేదబ్బు... ఈ కంది, పెసరా... నైజాన్తే...! అబ్బో...అధిక దిగుబడి నిచ్చే పంటలు... అద్భుతం!" వెంకట్రావుడు రెండు లొటికెలు వేసి మురిసి పోయాడు.

అపుడే వెంకులుగాడు ఆదరాబాదరాగా వచ్చేసి కూలబడ్డాడు. "అన్నా వెంకట్రావులన్నా... నీ భూమిల ఫస్టుక్లాసు మొక్కలు... ఇంగ నీ పంట పండిందనుకో... నిన్ను చూసి మేవందరం దాన్లోనే దిగబడిపోయి డ్రిప్... బిందు సేద్యానికి జొరబడి పోవాలె...

"అయితే పోయి చూసొచ్చినావన్నమాట... ఏం మొక్కలు వేసింద్రా!" యాద్గిరి బీడీ విసిరేస్తూ అడిగాడు.

"అబ్బో.. మల్బరీ... లవంగాలు... యాలకులు... పారీసు పూలు... అవిగాని పెరిగి పెద్దవైతే నాసామిరంగా... అన్నీ సిమ్లా.. కేరళా... డార్జిలింగుల్లో పెరిగేవేనాయె...

వెంకట్రావుడు ఇబ్బందిగా... అసహనంగా... అటు ఇటు కదిలాడు.

"లవంగాలు కిలోవెయ్యి... యాలకులు రెండు వేలు. మల్బరీ ఆకులు కూరొండుకోవచ్చు. పూలు రెండు చెవుల్లోకి...

వెంకట్రావుడికి మూర్ఛవచ్చినంత పనయ్యింది-

"అదిసరెగానిరా... అసలు వీడి భూమిలోకి నీళ్ళు యాడ్నుంచి తెచ్చి ఈ పిచికారీ కార్యక్రమం చేసిపారేసినారు...!" యాద్గిరి కుతూహలంగా అడిగాడు.

"ఓ... అదా... మన యమ్మెల్లేగారు 'అమృత' కంపెనీ నుండి నాలుగు నీళ్ళ టాంకర్లు తెప్పించి వాటి నుండి పిచికారీ కొట్టిచ్చిండు. యాడాది పొడుగునా... వీడు తెప్పించుకోవాలె... చుట్టూ ఎక్కడా ఎట్లాంటి నీళ్ళ ఆదరువు లేదుగదా!"

వెంకట్రావుడు మెలికలు తిరిగి చప్టామీద మూర్ఛలోకి జారుకున్నాడు. ●



నిగనిగలాడే ముచ్చటైన కేశాలు, నునుపైన చర్మం, చంద్రబింబంలాంటి ముఖవర్ఛస్సు, చురుకైన కళ్ళు, ఇలా ప్రతి భాగమూ అందంగా, ఆరోగ్యంగా వుండాలని కోరుకోవడం సహజమే. నిజానికిది చాలా చిన్న కోరికే. దీన్ని కూడా అందని ద్రాక్షగానే మార్చేస్తోంది కాలుష్య భూతం. అందాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. నగరాలలో, పట్టణాలలో ఈ ఆధునిక శాపం నుండి విముక్తి పొందలేకున్నాం.

అందాన్ని ఆరోగ్యాన్ని నాశనం చేసే కాలుష్యం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమాజ పురోభివృద్ధికి చక్కటి బాటలు వేస్తున్నమాట ఎంత నిజమో, కాలుష్యాన్ని వెదజల్లుతున్న మాటా అంతేనిజం. వాహనాలు, పరిశ్రమలు, నిర్మాణ పనులూ అన్నీ కాలుష్యాన్ని మోసుకొస్తున్నాయి. దీనిమూలంగా చర్మం, వెంట్రుకలు, కళ్ళు బాగా దెబ్బతింటున్నాయి. ఆరోగ్యం క్షీణిస్తోంది. పొగమంచు, దుర్వాసనతో కూడిన గాలి ఆరోగ్యానికి తెస్తున్న కీడు ఇంతని చెప్పటానికి లేదు. కారు మీద పేరుకునే దుమ్ము మాదిరిగానే, ఈ కాలుష్య కారకాలూ మానవ దేహం మీద పేరుకుంటాయి. నగరాలు, పట్టణాలలో పరిశ్రమల నుండి విడుదలయ్యే కొన్ని 'ఆమ్లాలు' చర్మం మీద 'రసాయన తొక్కలు'గా ఏర్పడతాయి. ఇవి క్రమంగా కరిగి చర్మంపై పొర 'స్ట్రేటమ్ కార్నియమ్'ను చిట్లగొడతాయి. దీంతో బ్యాక్టీరియా నుండి శరీరాన్ని రక్షించే శక్తిని ఈ పొర కోల్పోతుంది. ఫలితం 'ఇన్‌ఫెక్షన్'! ఏ ఆచ్ఛాదనా లేకుండా బయటకు కనిపించే ముఖం, మెడ, చేతులు, పాదాలు ఈ కాలుష్య కారకాలకు దెబ్బతింటాయి. వీటిలో ఎక్కువగా పాడైపోయేది ముఖచర్మం. ఇది చాలా సున్నిత భాగం. ముఖం మీద చేరుకునే దుమ్ము, మురికి, మొటిమలు, పులిపిరి, నల్లచారికలు ఏర్పడడానికి కారణమవుతాయి. సకాలంలో సరైన చికిత్స చేయించుకోకపోతే ఇవి శాశ్వత మచ్చలుగా నిలిచిపోతాయి. ఎందుకంటే, దుమ్మునూ, మురికినీ సాదరంగా ఆహ్వానించే గుణవంతురాలు ఈ జిడ్డు చర్మం. పరిశ్రమల నుండి విడుదలయ్యే రసాయనాలు చర్మానికి హాని చేస్తాయి. ఫ్యాక్టరీల పరిసరాలలో నివసించే వారిలో ఎక్కువగా చర్మవ్యాధులు కనిపిస్తాయి. సూర్యుని నుండి వచ్చే అతినీలలోహిత కిరణాలు కూడా చర్మానికి శత్రువులే. వీటి వల్ల చర్మ కేన్సర్ వస్తుంది. అయితే ఈ కిరణాలు మనకు చేరకుండా వాతావరణంలో 'ఓజోన్‌పొర' రక్షిస్తుంది. కానీ ఈ పొరను నాశనం చేస్తున్నదీ కాలుష్యం. కాబట్టి ఒక్కొక్కసారి ఈ హానికర కిరణాలు మన శరీరాన్ని తాకే అవకాశం వుంది. దీన్ని తప్పించుకోవాలంటే 'సన్‌స్క్రీన్' వాడడమే



తరుణోపాయం. ముఖం, మెడ భాగాలపై కాలుష్య కారకాలు చేరకుండా అడ్డుగోడగా పని చేస్తుంది. కాలుష్యం వల్ల దెబ్బతినే వాటిలో మరొకటి జుట్టు. నీరు, గాలి కాలుష్యం వల్ల జుట్టు పాడవుతుంది. కొన్ని ప్రాంతాలలోని నీటిలో జుట్టుకు హానిచేసే రసాయనాలు వున్నట్టు గుర్తించారు. జుట్టు రాలిపోవడం, నెరిసిపోవడం, చిట్లిపోవడం వంటి లక్షణాలకు కాలుష్యమూ కారణమే. గాలిలోని దుమ్ము, మురికి జుట్టును చేరి, తిష్టవేయడం హానికరం. కాబట్టి వారానికి కనీసం రెండుసార్లు తలస్నానం చేయడం చాలా మంచిది. కాలుష్యానికి ఎక్కువగా ప్రభావితమయ్యే మరో ప్రధాన భాగం కళ్ళు. గాలి కాలుష్యం వల్ల కళ్ళు ఎర్రబడడం, దురద, కళ్ళ మంటలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాలుష్యం సాధారణ ఆరోగ్యాన్ని కూడా కుంటుపరుస్తుంది. శ్వాస, జీర్ణకోశ వ్యాధులూ, కేన్సర్‌కు బాటలు వేస్తుంది. రేడియేషన్, వ్యర్థ పదార్థాలు, పెస్టిసైడ్స్ వంటివన్నీ కాలుష్యాన్ని పెంచేస్తాయి.

కాలుష్యం భూతం నుండి చర్మ రక్షణకు చిట్కాలు

1. బయటకు వెళ్ళి వచ్చినప్పుడల్లా శుభ్రంగా ముఖం కడుక్కోవాలి.
2. శుభ్రంగా ఉతికిన టవల్స్‌నే వాడాలి. పని చేసే స్థలాల్లో సైతం పరిశుభ్రమైన టవల్స్‌తో పాటు సబ్బును కూడా అందుబాటులో వుంచుకోవాలి.
3. పదే పదే చేతులతో ముఖాన్ని తాకకూడదు.
4. దురద, మొటిమలు, నల్లచారికలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా చర్మవైద్యుని సంప్రదించాలి.
5. చర్మాన్ని 'మేకప్'తో ఎక్కువ సమయం కప్పేయవద్దు. మేకప్ తప్పనిసరి అయితే 'నాన్ ఆయిల్ ప్రోడక్ట్స్'నే వాడడం మంచిది.
6. ఆల్కహాల్‌కూ, ఆల్కహాల్ ఉత్పత్తులకు దూరంగా వుండాలి. ఇవి 'స్ట్రాటమ్ కార్నియం'ను నాశనం చేస్తాయి.
7. పడుకునే ముందు తప్పనిసరిగా స్నానం చేయాలి. లేదా ముఖం, కాళ్ళూ, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
8. వారానికి కనీసం రెండుసార్లు తలస్నానం చేయడం ఉత్తమం.
9. పొడవైన వెంట్రుకలున్న స్త్రీలు గట్టిగా జడవేసుకుంటే దుమ్ము, మురికి చేరుకునే అవకాశాలు తగ్గుతాయి. చిన్న పిల్లలు, పురుషులు మరీ ఎక్కువగా జుత్తు పెంచుకుంటే కాలుష్య పదార్థాలు తిష్టవేస్తాయి.
10. ఆయిల్ వాడకం తగ్గిస్తే మంచిది. ఒకవేళ ఉపయోగించినా మరీ నూనె కారేలా కాకుండా, పలుచగా రాసుకోవడం మంచిది.
11. డ్రైవింగ్ సమయంలో కళ్ళజోడు వాడడం తప్పనిసరి.
12. కళ్ళ పరిరక్షణ కోసం బయటకు వెళ్ళేటప్పుడు 'యు.వి. ప్రొటక్టివ్ సన్‌గ్లాసెస్' వాడడం ప్రయోజనకరం. కాటరాక్ట్, కేన్సర్ రాకుండా, అల్ట్రా వైలెట్ కిరణాలు కంటిని తాకకుండా ఇవి కాపాడతాయి. ఎండతో సంబంధం లేకుండా వీటిని వాడొచ్చు.
13. ఇంటికి రాగానే స్వచ్ఛమైన నీటితో కళ్ళను శుభ్రంగా కడుక్కోవాలి.
14. తరచూ కళ్ళు ఎర్రబడడం, ఉబ్బడం, దురద వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుని సంప్రదించాలి.

మన చుట్టూ రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతోంది. కాబట్టి ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఆరోగ్యానికీ, అనందానికీ తీవ్ర నష్టం కలుగుతుంది. ఈ ప్రమాదం నుండి మనల్ని మనం రక్షించుకోవాలంటే పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నిరోధక చర్యలు చేపట్టేలా డిమాండ్ చేయడమే తెలివైన పని. ఇది ఆలస్యమైన కొద్దీ మన అందం, ఆరోగ్యం దెబ్బతింటూనే వుంటాయి. ●

ఆరోగ్య స్థాయిని పెంచిన చైతన్యం

గత వేసవిలో పాశ్చాత్య మీడియా సృష్టించిన 'సార్స్' బూచి మీకు గుర్తుండే ఉంటుంది. సార్స్ వలన జరిగిన నష్టం మాటెలా ఉన్నా దాని వలన తమ ప్రజలకు చాలా మేలు జరిగిందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సార్స్‌ను నివారించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం విస్తృతమైన ప్రచారం చేసింది. మన దేశంలోలాగా పులిరాజా హోర్డింగ్‌లు, పోస్టర్ల వంటి ఆర్భాటాలకు పరిమితం కాకుండా విస్తృతంగా వైద్య సిబ్బందిని, సామాజిక కార్యకర్తలను కదిలించి గ్రామాల స్థాయిలో ప్రజల మనస్సుకు హత్తుకునేలా కార్యక్రమాలు చేపట్టారు. కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత, భోజనానికి ముందు ప్రతిసారీ సబ్బుతో చేతులు కడుక్కునేలా ప్రభుత్వం ప్రజలను చైతన్య పరిచింది. ఫలితంగా ప్రజల సాధారణ ఆరోగ్య స్థాయి మెరుగు పడింది. అపరిశుభ్రత వలన సంభవించే సూక్ష్మజీవి సంబంధ వ్యాధులు ముఖ్యంగా వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధుల్లో 40 శాతానికి పైగా తగ్గుదల నమోదయిందని 'ద జర్నల్ ఆఫ్ హైజీన్ అండ్ హెల్త్' ప్రకటించింది. సబ్బుతో కనీసం అర నిముషంపాటు చేతులను బాగా రుద్ది కడిగితే సబ్బులోని క్షార రసాయనాలు, చేతుల రాపిడి కారణంగా 90 శాతం వైరస్‌లు, ఇతర వ్యాధికారక సూక్ష్మజీవుల నుంచి రక్షణ పొందడం సాధ్యమయిందని ఆ జర్నల్ ప్రకటించింది.

డాక్టర్ జి.ఎస్.కె. శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ మెంబర్, హైదరాబాద్

◆ నా వయస్సు 17 సంవత్సరాలు. (1) నేను నిద్రపోయే సమయంలో నా ప్రమేయం లేకుండా నా శుక్రకణం నుండి శుక్రాలు వస్తున్నాయి. అందువల్ల నేను రోజురోజుకి క్షీణించిపోతున్నాను. కనుక నా సమస్యకు పరిష్కార మార్గాన్ని తెలుపుతారని కోరుతూ వాడవలసిన మందులు కూడా తెలపవలసిందిగా ప్రార్థిస్తున్నాను (2) నాకు ఎడమ వైపు షేరు (బుడ్డ) దిగింది. దానిని నివారించడానికి లంగోట తడిపి కొన్ని గంటలు కడితే తగ్గుతుందా? నా సమస్యలకు తగినవరిష్కార మార్గాన్ని చూపుతారని ఆశిస్తున్నాను.

– పేరు రాయలేదు

నిద్రలో వీర్యస్కలనం జరగడం దాదాపు యువకులందరికీ ఎదురయ్యే అనుభవం. మనం మలమూత్ర విసర్జనం చేయడం ఎంత సహజమో, వీర్యస్కలనం కూడా అంతే సహజమైంది. దానివల్ల ఎలాంటి హానీ జరగదు. మీరు దీని గురించి అతిగా ఆలోచించి సహజ పరిణామాన్ని సమస్యగా వూహించుకొని ఏదో కీడు జరుగుతోందన్న మానసిక వ్యథతో క్షీణించి పోతున్నారు. అంతేగాని ఇది జబ్బేమీ కాదు. అందుకే దీనికెవిధమైన మందులు వాడాల్సిన అవసరం లేదు. మీ స్నేహితులతో సమస్య పంచుకోండి. అది ఎంత సహజమో మీకే బోధపడుతుంది.

బుడ్డ దిగకుండా, బుడ్డ దిగాక అది పెరగకుండా లంగోటను వాడవచ్చుగాని, బుడ్డ దిగాక లంగోట తడిపి కడితే తగ్గుతుందనుకోవడం మూర్ఖత్వం. దీనికి ఎలాంటి మందులు, చిట్కాలు లేవు. ఒకసారి బుడ్డ దిగాక శస్త్రచికిత్సే మార్గం. మీరు వెంటనే సర్జన్‌ని సంప్రదించండి. ఇది చాలా చిన్న అపరేషన్. ఆందోళన చెందాల్సిన పని లేదు.

సమాజపరిస్థితులకు అద్దం 'సాగరకోయిల'

శ్రీమతి ఎం.ఆర్.అరుణకుమారి రాసిన 'సాగరకోయిల' ఆమెకు సమాజంలోని స్థితిగతుల పట్ల ఉన్న అవగాహన, శాస్త్రీయమైన ఆధునిక దృక్పథానికి అద్దం పడుతుంది. ఈ సంపుటిలోని కథలు అన్నీ చదివించగలిగేలా ఉండడమే కాదు ఆలోచింప చేసేవిగా కూడా ఉన్నాయి. వీటిలో అనేకం ఇంతకుముందే చదివినట్లు అనిపిస్తాయి. వాటిని మనం పత్రికలల్లో

సాగర కోయిల
రచన : ఎం.ఆర్.అరుణ కుమారి;
వెల : రు. 75/-;
ప్రతులకు : ఎమ్.ఆర్.కుమారి, 15-2015/1, అశోకపురం, చిత్తూరు.; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

వార్తల రూపంలో చదివి ఉండడమే కారణం. సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులనే ఇతివృత్తాలుగా తీసుకొని ఆమె తనదైన శైలిలో ఈ కథలకు ప్రాణం పోశారు. అందులో స్త్రీల సమస్యల గురించే ఎక్కువగా ప్రస్తావించారు. సామాజిక పరిస్థితుల వారిపై చూపుతున్న ప్రభావాన్ని చక్కగా ఆవిష్కరించారు.

కథల విషయానికొస్తే.. మాయమాటలతో ప్రజలను మోసం చేసే బాబాల బండారం బయటపడ్డాక బాధితుల కుటుంబాల్లో చెలరేగే తుఫాను 'సమిధలు'లో కనిపిస్తుంది. అత్తమామలు, భర్త సూటిపోటి మాటలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ప్రణీతను వినీత ఓదార్చి మనోస్థైర్యాన్ని ఇస్తుంది. ప్రేమించి మోసం చేసి పరోక్షంగా తనకు ఎయిడ్స్ సంక్రమించేలా చేసిన ప్రభాత్‌కి బుద్ధి చెప్పే ప్రదమ పాత్ర గురించి ప్రేమ సుడిగుండాలులో చదువుతాము. కుటుంబాన్ని పోషించడానికి ఉద్యోగం పేరుతో వేశ్యగా మారి, అందులో నుండి బయటపడాలని తపించే సింధు కథ 'సాగర కోయిల'. ఉద్యోగం ఇచ్చే పేరుతో తన స్నేహితురాలిని మోసం చేసిన తల్లికి గుణపాఠంగా తానూ అదే బాటలో వెళ్లే సమీరని 'మన్నించు నేస్తమా!'లో చూడొచ్చు. పాఠశాలలు, హాస్టళ్లు, ఇళ్లలో బాలికలపై జరుగుతున్న అత్యాచారాలకు 'శత్రు స్పర్శ', 'కసాయి మనిషి' తార్కాణాలు.

కొన్ని సంఘటనలు మరీ దిగ్భ్రాంతికరంగా, నమ్మశక్యంగా లేనట్లు అనిపిస్తాయి. సమాజంలో జరుగుతున్న సంఘటనలు పిల్లల మానసిక స్థితిపై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపుతాయో 'టచ్ మి నాట్' వివరిస్తుంది. తమకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొనే స్త్రీలు 'న్యాయపోరాటం', 'చీకటి రంగులు'లో కనిపిస్తారు.

ఇవేకాదు. ఆర్థిక అవసరాలు స్త్రీని ఎంతగా అవస్థలపాల్జేస్తాయో, దాని ప్రభావం పిల్లలపై ఏ విధంగా పడుతుందో తెలిపే కథలు కూడా అరుణకుమారి రాశారు. వాటికి తార్కాణాలు 'సంక్రాంతి రోజులు', 'రేపటి బతుకులు', 'భోజ్యేషుమాత'. కరువు స్త్రీ మరింత దారుణంగా బాధిస్తుంది. ఈ ప్రత్యేక సమస్యను రచయిత్రి ఎంతో ప్రతిభావంతంగా చిత్రించారు. 'అమావాస్య వెన్నెల' కథ కరువు, పెత్తందార్ల దౌష్ట్యం, చేతబడి (బాణామతి) నెపంతో జరిగే దుర్మార్గాల వంటి అనేక గ్రామీణ సమస్యలకు సమగ్ర విశ్లేషణగా నిలిచింది.

ఎంతో చక్కటి అవగాహనతో రాసిన ఈ కథలు చదివిండమే కాదు మనల్ని ఆలోచింపచేస్తాయి కూడా.

- జ్యోతి

శ్రీకారం



తిరుగు ప్రయాణం
రచన : నల్లాల లక్ష్మీరాజం
వెల : రు. 30/-; **ప్రతులకు** : విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ, 2-2-186/53/5, బాగ్అంబర్‌పేట్, హైదరాబాద్.



నడమంత్రపు ఊహల్లో నరులు
రచన : ఆకురాతి గోపాలకృష్ణ;
వెల : రు. 10/-; **ప్రతులకు** : ఆకురాతి గోపాలకృష్ణ, జాతీయ భాషా పండితులు (రిటైర్డు), ఏ.యస్.పేట, నెల్లూరు జిల్లా



జిడ్డు కృష్ణమూర్తి గరుడయానం
తెలుగుసేత : నీలంరాజు దమయంతి
వెల : రు. 60/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



కాపాడే దేవతలు
రచన : దొరవేటి
వెల : రు. 60/-;
ప్రతులకు : శుభోదయ విద్యాలయం, సిద్దిపేట; సాహిత్య నికేతన్, బర్కత్‌పుర, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఎడారిలో బంగారు కోట



అది ఎడారి రాష్ట్రం... అయినా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే గత వైభవ చిహ్నాలను ఎంతో పదిలంగా దాచుకుంది. పింక్‌సిటీగా పేరుపొందిన జైపూర్, సరస్సుల నగరం ఉదయ్‌పూర్, బంగారు కోటగా ప్రసిద్ధికెక్కిన జైసల్మేర్ కోట ఇంకా ఎన్నో, ఎన్నెన్నో ఆకర్షణీయమైన ప్రాంతాలు రాజస్థాన్‌లో ఉన్నాయి. దేశంలో ఇంకా బ్రతికున్న కోటగా జైసల్మేర్ కోటను చెప్పుకోవచ్చు. గతంలో దేశాన్ని ఏలిన రాజులు భారతదేశం నలుమూలలా నిర్మించుకున్న కోటలు శత్రువుల దాడిలోనో లేక రాజరికాలు అంతరించిన తర్వాత ఎవరూ పట్టించుకోకనో శిధిలమవుతున్నాయి. అయితే జైసల్మేర్ కోట మాత్రం ఇంకా జీవం ఉన్నకోటగా చెప్పవచ్చు. ఎందుకంటే దేశంలో ఎక్కడా లేనట్లుగా ఆ కోటలో 5000 మంది ప్రజలు నివసిస్తున్నారు. వారు అలనాటి రాజవంశీయులే కాకపోవచ్చు, కాని కోటను ఇప్పటికీ ఎంతోశుభ్రంగా, శిధిలం కాకుండా వారే కాపాడుతున్నారు.

జైసల్మేర్ పట్టణమే ఎంతో సుందరంగా ఉంటుంది. ఎడారి మధ్యలో ఉండటం వల్ల చుట్టూ బంగారువన్నె ఇసుక కనిపిస్తున్నందున పట్టణం కూడా బంగారు ఛాయతో మెరుస్తుంటుంది. క్రీస్తుశకం 1156వ సంవత్సరంలో త్రికూట పర్వతంపైన కృష్ణవంశీలైన రాజపుత్రులు ఈ జైసల్మేర్ పట్టనాన్ని నిర్మించారు. యువరాజు జైసాల్ పేరుమీద ఈ పట్టణం నిర్మితమైంది. భాటి యాదవరాజుల తొమ్మిదివ రాజధానిగా జైసల్మేర్ వాసికెక్కింది. బంగారు కోటగా పేరున్న జైసల్మేర్ కోటను 250 అడుగుల ఎత్తున మూడు శిఖరాలు గల త్రికూట పర్వత పీఠభూమిపై నిర్మించారు. ఆ ఎడారిలో ఎటునుండి చూసినా ఈ కోట కనిపిస్తుంది. కోటలో ప్రవేశించడానికి నాలుగు దిక్కుల నుండి నాలుగుగేట్లు ఉన్నాయి. కోట మొత్తం ఇసుక రాళ్ళతో నిర్మించారు. దానిని నిర్మించిన వారి సాంకేతిక, నిర్మాణ చాతుర్యం ఎంత గొప్పదంటే కోటగోడలకు అద్భుతంగా రాళ్ళు పేర్చారే గాని ఎక్కడా రాళ్ళమధ్య సిమెంటు లాంటి పదార్థాన్ని వాడలేదు. దీన్ని నిర్మించి దాదాపు వెయ్యేళ్ళు అవుతున్నా అందులో ఇప్పటికీ 5వేల మంది ప్రజలు నివసిస్తున్నారంటే వారి నిర్మాణకౌశలం ఎంత గొప్పదో ఊహించుకోవలసిందే. కోటలోపలి దర్బారుహాల్ చూసి తీరవలసిందేగాని వర్ణించడం ఎవరితరం కాదు. దాన్ని అంత అందంగా రంగు రంగుల, పాలరాళ్ళతో తీర్చిదిద్దారు.

లోపల రాజమందిరాలు మలచిన తీరు కూడా అద్భుతంగా ఉంటుంది. ఐదంతస్తుల ఈ మందిరాల లోపల సీలింగ్‌కు బంగారుపూత పూశారు. జైసల్మేర్ పట్టణంలో కోట అందులోని మందిరాల తర్వాత చూడదగ్గ ప్రదేశం నైట్‌సఫారీ. ఎడారిలో రాత్రిపూట పయనం ఒక అద్భుత. ఎటుచూసినా అంతంకాని ఎడారి. ఆ ఇసుకలో ఒంటెలపై షికారు మరువలేని అనుభవం. పట్టణానికి 45 కిలోమీటర్ల దూరంలో ఈ సఫారీ ఉంది. నైట్‌సఫారీ మార్గంలో కుల్దారా అనే గ్రామం కనిపిస్తుంది. 13వ శతాబ్దంలో నిర్మించిన ఆ గ్రామం ఆనాటి నగర ప్రణాళికకు అద్దం పడుతుంది. ప్రస్తుతం దీన్ని వారసత్వ గ్రామంగా ప్రకటించి సంరక్షిస్తున్నారు. గ్రామంలోగల 600 ఇళ్ళు ఆనాటి జీవనరీతులకు ప్రతిబింబాలుగా ఉన్నాయి. ఈ గ్రామం తర్వాత కనిపించే పార్క్ 18 కోట్ల సంవత్సరాల క్రితం నాటి అడవికి సాక్షీభూతం. ఈ ఎడారి ప్రాంతమంతా ఆనాడు దట్టమైన అడవి. ప్రకృతి ఉత్పాతాల కారణంగా అడవి భూగర్భంలో కలిసిపోగా నేల అంతా ఎడారిగా మారిపోయింది. ఎడారిలో ఏర్పాటు చేసిన ఈ జాతీయపార్క్ పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతుంది. పురాతన కాలం నాటి చెట్ల శిధిలాలు, రాళ్ళు, ఎడారి జంతువులు అనేకం అక్కడ కనిపిస్తాయి. ఎడారి పక్షులు, సరీసృపాలు ప్రత్యేక ఆకర్షణ.

పట్టణం చుట్టువక్కలా అంతా చూడటం అయినతర్వాత ఇక జైసల్మేర్‌లో షాపింగ్ కూడా మంచి అనుభూతిని మిగులుస్తుంది. రాజస్థాన్ సాంప్రదాయక దుస్తులు, రగ్గులు, వెండి ఆభరణాలు, పెయింటింగ్‌లు ఇక్కడి ప్రత్యేకత.

జైసల్మేర్ వెళ్ళడానికి అక్టోబర్ నుండి మార్చి వరకు ఎలయన్స్ ఎయిర్ లింక్స్ విమానాలు నడుపుతోంది. దేశంలో ప్రధాన నగరాల నుండి జైసల్మేర్‌కు నేరుగా రైలుమార్గం లేదు. జోధ్‌పూర్ వెళ్ళి అక్కడి నుండి మరో రైలులో వెళ్ళాలి. పట్టణంలో పర్యాటకుల వసతి కోసం ఏర్పాట్లు బాగానే ఉన్నాయి. ●



సెమ్మంగుడి... సంగీతజ్ఞాన పిపాసి

* భూపాలి

కర్ణాటక సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన గొప్ప సంగీతజ్ఞాని సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్. ఎంచుకున్న రంగంలో గొప్ప కృషి సాగించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చనడానికి ఆయన జీవితం ఒక చక్కని ఉదాహరణ. 95ఏళ్ల పాటు నిండైన జీవితం గడిపిన ఈ కర్ణాటక సంగీత పితామహుడు గత అక్టోబరు 31వ తేదీన తన 95వ యేట కన్నుమూశారు.

శ్రీనివాస అయ్యర్ 1908 జులై 25న తమిళనాడులోని సెమ్మంగుడి గ్రామంలో జన్మించారు. 'చీను' పేరుతో విఖ్యాతి పొందిన ఈయన తొమ్మిదవ ఏటే సంగీత విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. సోదరుని వరసయ్యే సెమ్మంగుడి నారాయణస్వామి, గోటు వాద్య నిపుణులు సఖారామారావు, సంగీత కళానిధి ఉమలాయపురం స్వామినాథ అయ్యర్, మహారాజపురం విశ్వనాథ అయ్యర్ వద్ద సంగీతం నేర్చుకున్నారు. గాత్రశుద్ధికోసం రోజుకు ఎనిమిది గంటల పైబడి సాధన చేశారు. భోజనానికి కూర్చున్నా ఆ గానం అలా సాగిపోతూనే వుండేది. అంతగా సంగీతంలో లీనమైపోయేవారు. తన 18వ యేట ఆయన తొలి కచేరి చేశారు.

సంగీత ప్రపంచానికి ఆయన ఎనలేని సేవ చేశారు. దాదాపు 22 సంవత్సరాల పాటు స్వాతి తిరునాళ్ సంగీత అకాడమీలో పనిచేశారు. చాలాకాలం పాటు ఆ అకాడమీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కొందరు సంగీత మిత్రుల సహాయంతో స్వాతి తిరునాళ్ రచించిన ఎన్నో కృతులకు బాణీలు సమకూర్చే బాధ్యతను భుజానేసుకున్నారు. 200 కీర్తనలను నొటేషన్‌తో సహా ప్రచురించారు. అలా సంగీత ప్రపంచంలో స్వాతి తిరునాళ్ కృతులు ప్రచారమయ్యేందుకు కారకులయ్యారు. రాగమాలికలో "భావయామి రఘురామం" కళ్యాణి రాగంలో "పంకజలోచన" వంటి కీర్తనలు విన్నప్పుడు మనసులో ఆయనే మెదులుతారు. స్వాతి తిరునాళ్ కీర్తనలను అంతగా ఆయన పాపులర్ చేశారు. ఈ అకాడమీలో పనిచేసే కాలంలోనే మూడేళ్లు సెలవు పెట్టి ఆకాశవాణి కర్ణాటక సంగీతవిభాగానికి చీఫ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

39 సంవత్సరాల వయసులోనే ఆయనకు మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వారి ప్రతిష్ఠాత్మకమైన "సంగీత కళానిధి" బిరుదు దక్కింది. ప్రభుత్వం పద్మభూషణ్, పద్మ విభూషణ్ బిరుదులతో సన్మానించింది.

ఎంచుకున్న రంగంలో నిరంతర కృషి సాగించడం.. నిత్య విద్యార్థిగా వుండటం... ఈ రెండు లక్షణాలను ఈ సంగీతకారుని జీవితం నుండి మనం నేర్చుకోవచ్చు.

గురుకుల పద్ధతిలో అంటే గురువు ఇంట్లోనే వుండి సంగీతం నేర్చుకున్న సెమ్మంగుడి తన శిష్యులకూ అదే పద్ధతిలో విద్య గరిపారు. మనకు బాగా సుపరిచితులైన ఎం.ఎస్ సుబ్బులక్ష్మి, ఏసుదాసులతో పాటు మరెందరో

రైతే గుర్తొస్తుంటాడు!

పిడికిల్ల బువ్వ
ముద్దగా పిసికినప్పుడల్లా
పాలకులు కసిగా గొంతు పిసికిన
రైతే గుర్తొస్తుంటాడు!
పైరు ఎండిన పొలాల్లో
పాదమూనినప్పుడల్లా
బగబగ మండుతున్న రైతు గుండె
సెగలెల్లి ఒళ్ళంతా మాడ్చినట్లుంటుంది!
గుండె తడారి
మూగపోయిన మోటబావుల
కళ్ళళ్ళోకి చూస్తుంటే..
కన్నీరాకిన రైతు కళ్లళ్ళో
దీపమారిన దివ్వెగూడులు గుర్తొస్తుంటాయ్!
చేలో కంకెళ్ళని కర్రని
చూచినపుడల్లా
కష్టాల భారంతో క్రుంగి
నిశ్చేష్టుడై నిలబడిపోయిన కృషీ శ్రేష్టుడే
గుర్తొస్తుంటాడు!
దున్నుకపోతున్న దుఃఖపు సాళ్లలో
చల్లుకొంటున్న శ్రమ విత్తుల చూచినప్పుడల్లా
విస్తరిస్తున్న విచారంలో
అంకురించబోయే ఆశలు గుర్తొస్తుంటాయ్!
డొక్కలెండి సొమ్మసిల్లి
దున్నుతున్న దుక్కిలో బోర్లబడ్డ
కాడికింది కరవలెద్దును చూచినపుడు
వెన్నంటిన పొట్టలో ఆకలి రాగం వింటూ
గుండెలపై ఎగసితన్నిన
బాకీబాధల పాదాల తాకిడికి
గిజగిజలాడి చేలోనే చెల్లిపోయిన
మా నాన్న గుర్తొస్తుంటాడు.
అకాల వర్షానికి అదపాదడపా కంకెళ్ళిన
కర్రలపై వాలిన
పరిగెపిట్టల పోరు చూస్తుంటే...
పంటలెండి యిల్లు కొల్లబోయినా
దప్పులు మోగిస్తూ అప్పుల వసూళ్ళకు
అధికార్లను ఉసిగొలిపే
ఆదరణ లేని పాలకులే గుర్తొస్తుంటారు!
నిట్టాడికూలి ఒరిగిపోయిన
రైతు రెల్లుగడ్డి ఇల్లు చూస్తుంటే...
నేతల వాగ్దానాల శిధిలాల్లో
కుప్పకూలిన రైతు కలలు గుర్తొస్తుంటాయ్!
రైతు ఆత్మహత్యా విషాదంలో

ఆయన వద్ద సంగీత విద్యనభ్యసించి అనంతర కాలంలో ఖ్యాతి గాంచారు. సెమ్మంగుడి కీర్తనలను వినడం ద్వారానే తాను - తనలాంటి ఎందరో విద్యార్థులు సంగీత పాఠాలు నేర్చుకోగలిగామంటారు ఆయన శిష్యులు పిఎస్ నారాయణస్వామి. ఈయన సెమ్మంగుడి ఇంట్లో వుండి ఐదేళ్లపాటు సంగీత పాఠాలు నేర్చారు.

సెమ్మంగుడి నిరంతర సంగీతజ్ఞాన పిపాసి. కర్ణాటక సంగీతంలో తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాక కూడా ఆయన జివిఎస్ బాలసుబ్రమణియన్, టి.బృంద, అరియక్కుడి వంటి వారి వద్దకెళ్లి మరికొన్ని కీర్తనలు నేర్చుకున్నారు. "ఖరహరప్రియ" ఆయనకు అత్యంత ప్రియమైన రాగం. అందుకే ఆయన్ని 'ఖరహరప్రియ శ్రీనివాస అయ్యర్' అని కూడా కొందరు పిలుస్తుండేవారు. సంప్రదాయకీర్తనలతో పాటు సుబ్రమణ్యభారతి రచించిన లలిత గీతాలను కూడా ఆయన ఇష్టంగా పాడుతుండేవారు. ఎంతటి పాండిత్యమున్నా ప్రయోగాలకు వెనకాడేవారు కాదు. ఎంచుకున్న రంగంలో నిరంతర కృషి సాగించడం.. నిత్య విద్యార్థిగా వుండటం... ఈ రెండు లక్షణాలను ఈ సంగీతకారుని జీవితం నుండి మనం నేర్చుకోవచ్చు.



అనిల్

ఏకలవ్య శిష్యుడు ఆ చిత్రకారుడు

కృషి, పట్టుదల వుండాలే కాని ఎంతటి క్లిష్టమైన విద్యనైనా అందిపుచ్చుకోవచ్చు. దీనికి సజీవ ఉదాహరణ నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన పడిగెల అనిల్ కుమార్. ఖారీ పెయింటర్ వాడే కుంచెలు, బ్రష్‌లు అక్కరలేదు అతనికి. కొయ్యపుల్లనే బ్రష్‌గా చేసుకొని చింతగింజలు, కోడిగుడ్ల కవచాలు, చాక్‌పీసులు, సబ్బులు, రావి ఆకులపై పెయింటింగ్‌లు వేస్తుంటాడు. ఇంతేకాక 4 సంవత్సరాల క్రితం డ్రాయింగ్‌పై ఎక్కువ వుండటంచేత అనేక జాతీయ నాయకుల చిత్రాలు గీశానంటాడు అనిల్. తన చిత్రాలలో ప్రధానంగా గాంధీ, నెహ్రూ, వివేకానంద, శివాజీలతో పాటు ప్రస్తుత నాయకులు చంద్రబాబు నాయుడు, వాజ్‌పేయి, క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, అయ్యప్పస్వామి తదితరమైనవి వున్నాయి. తనకు ప్రత్యేక గురువు ఎవరూ లేరని వివిధ పత్రికలలో వచ్చిన చిత్రాలను చూసి నేర్చుకున్నానని చెప్పారు. తన కుటుంబంలో ఎవరూ చిత్రకారులు లేరని చెబుతాడు అనిల్. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా లేని తాను బయట ఎక్కడ పోటీలు జరిగినా వెళ్లలేకపోయానని చెప్పాడు. ప్రస్తుతం ఇంటర్ (బిపిసి) ప్రథమ సంవత్సరం చదువుతున్న అనిల్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన తర్వాత పెయింటింగ్‌పై ఎక్కువ కృషి కేంద్రీకరించనున్నట్లు చెప్పాడు. ఎవరైనా ప్రోత్సాహం ఇచ్చినట్లయితే త్వరలో తన చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేస్తానని అనిల్ చెప్పారు. గొప్ప చిత్రకారుడు కావాలన్న అనిల్ ఆశయం నెరవేరాలని ఆశిద్దాం.

- చకిలం సురేందర్‌రావు



మునిగిపోయిన ఆ కుటుంబాన్ని చూస్తుంటె...
పాలకుల మాయాజాలంలో
దినదినం దిగజారిపోతున్న రైతు బతుకే
గుర్తొస్తుంటుంది!
దగదగ దర్జాలతో
పట్టణం నడిబొడ్డున లేస్తున్న
దళారీల దర్బారులు చూస్తుంటే...
పాలకుల ఇళ్ళల్లో పక్కలేస్తూ
చట్టాలకు చుట్టాలై
పల్లెల దోచిన పైరవీలు గుర్తొస్తుంటాయ్!
కోతల అదునులో కొడవళ్ళు నూరుతున్న
రైతు బిడ్డల చూస్తుంటే...
ఎన్నికల అదునులో దుష్టపన్నాగాలతో
గద్దెనెక్కాలనే పెద్దల తుదముట్టించేందుకు
నడుము కట్టి నిల్చునే నవయువత
కిరాతక రాక్షసత్వాన్ని నరికేందుకు
అపరకాళికలై గుర్తొస్తుంటారు!

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ADVOCATE

న్యాయసందేహాలు

20 ఏళ్ళుగా ఎదురు చూస్తున్నాను

నాకు 1979లో పెద్దల సమక్షంలో పెళ్ళి అయ్యింది. మేము ఒకటిన్నర సంవత్సరం కాపురం చేశాం. మొదటి కాన్పుకు మా మామగారు వచ్చి మా ఆవిడను డెలివరీకి తీసుకు వెళ్ళారు. డెలివరి తరువాత అనేక నెలల పాటు నన్ను వాళ్ళ ఇంటి చుట్టూ తిప్పుకున్నారు. కానీ నా భార్యను పంప లేదు. నేను నా భార్యను మన ఇంటికి వెళ్దాము రమ్మనమని అడిగాను. తన తల్లిదండ్రులు పంపితే వస్తాను అంటుంది. రాదు.

పుట్టిన పాపకు 20 సంవత్సరాలు దాటాయి. బంధువులకు చెప్పినా ఎవరూ హెల్ప్ చేయడం లేదు. 20 సంవత్సరాలుగా బ్రహ్మచారిగానే గడుపుతున్నాను. నాకు ఏదైనా మార్గం చూపించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. డబ్బు ఖర్చు చేసే స్తోమత లేదు.

- వీరయ్య, పెదకూరపాడు, గుంటూరుజిల్లా

మీకు దాదాపు పాతిక సంవత్సరాల క్రితం పెళ్ళయినా ఇప్పటి వరకు విడిగా ఉంటూ మీ భార్య కోసం ఎదురు చూస్తున్నారంటే మీ సహనానికి ఆశ్చర్యమేస్తోంది. ఏ తండ్రీ తన కూతురి కాపురం తానే చెడగొట్టుకోడు. కాని మీ మామగారు తన కూతుర్ని పంపించడం లేదంటే మీకు ఆర్థిక స్థోమత అసలు లేదని దాంతో తన కూతురు కష్టపడుతుందని పంపించి ఉండడు. ఇలాంటి పరిస్థితులు వున్నా ఆ తండ్రి అలా చేసి ఉండాల్సింది కాదు. తనే ఏదైనా చేసి మీ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచివుంటే బాగుండేది. మీ భార్యను, పిల్లను పోషించే అవసరం ప్రస్తుతం మీకు లేకున్నా, మీరు ఒక్కరే ఉంటున్నా, మీ ఆర్థిక పరిస్థితి బాగా లేదంటున్నారంటే మీ సంపాదన ఎలా ఉంటుందో ఊహించుకునే మీ మామగారు అలా చేసి ఉంటారు.

మీ భార్యని మీరు కావాలనుకుంటే చట్టబద్ధంగా 'రెస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్" పిటిషన్ వేసి కోర్టు వారి సమ్మతితో ఆమెను ఒప్పించి కాపురానికి రప్పించుకోవచ్చు. మీకు ఆర్థిక స్థోమత లేదంటున్నారు. కాబట్టి మీరుంటున్న దగ్గరలోని న్యాయస్థానంలో సంప్రదించి 'లీగల్ ఎయిడ్' ద్వారా మీకు ఏ ఖర్చు లేకుండా న్యాయాన్ని పొందవచ్చు.

దీని కన్నా ముందు మీ ఆర్థిక స్థోమత పెంచుకోవడానికి ఏదైనా రాబడి వున్న వ్యాపకం చేసుకుంటూ భార్యా పిల్లల్ని పోషించగలడనే నమ్మకాన్ని మీ మామగారికి కలిగిస్తే ఫలితం మంచిగా ఉండొచ్చు.

వీలునామాతో అన్యాయం

మా తాతయ్యకి నలుగురు కుమారులు. వారిలో మా నాన్నగారు ద్వితీయ పుత్రుడు. మా తాతయ్య ఎవరికి తెలియకుండా వీలునామా రాశారు. అందులో ఎకరా 40 సెంట్లు ఎక్కువగా మా పెదనాన్నకి, చిన్నాన్నకి రాశారు. వాళ్ళిద్దరే దగ్గరుండి మా తాతయ్య చేత రాయించారు. మా తాతయ్య బతికే వున్నారు. ఆయనకి ఎంత చెప్పినా మా మాట వినడం లేదు. అందువల్ల మేము కోర్టును ఆశ్రయించాలనుకుంటున్నాము. మా సందేహాలను తీరుస్తారని ఆశిస్తూ...

1. మా తాతయ్య బ్రతికే వున్నారు కాబట్టి కోర్టులో వేసిన వీలునామా చెల్లుతుందా?

2. మా తాతయ్య ఆస్తి తన స్వార్జితం అంటున్నారు. కానీ మా తాతయ్య వాళ్ళ నాన్న 5 ఎకరాలు అంబారం చేసేవారు. ఆ 5 ఎకరాలు మా తాతయ్యకు వాటాగా ఇచ్చారు. రెండు ఎకరాలు మా తాతయ్య స్వంతంగా కొన్నారు.

అందువల్ల ఆ రెండెకరాలు మా తాతయ్య స్వార్జితం అవుతుందా ? లేకపోతే పిత్రార్జితం అయితే మనవడిగా మా నాన్నగారికి ఎటువంటి హక్కు ఉంటుంది. స్వార్జితం అయితే మా తాతయ్యకు ఇష్టం వచ్చినట్టు రాసుకోవచ్చా.

మేము ఏ విధంగా చేస్తే మంచిదో తెలుపుతారని ఆశిస్తున్నాను.

- సుధాకర్, శ్రీకాకుళం.

మీ తాతయ్యగారి చేత మీ పెద్దనాన్న, చిన్నాన్న బలవంతంగా రాయించారు అంటూనే, ఆయనకి ఎంత చెప్పినా వినడం లేదు అంటున్నారు. అంటే వీలునామా అతని ఇష్ట ప్రకారమే రాశాడని అర్థమవుతోంది.

మీరు కోర్టులో కేసు వేసినా అది తన స్వార్జితమంటాడు. అది మీ తాతగారి తండ్రి నుండి సంక్రమించిన ఆస్తి అని మీరు ఆధారాలు చూపించగలిగితేనే ఆ ఆస్తిలో సరైన వాటా పొందగలుగుతారు. అతను బతికే ఉన్నాడు కాబట్టి వీలునామా చెల్లదు. అది పిత్రార్జితమని అప్పటి రెవెన్యూ రికార్డుల్లో, ఏమైనా ఆధారాలు ఉంటేనే మీరు కోర్టుకు వెళ్ళడం మంచిది. అలా కాదని అతని ఇష్టానికి విరుద్ధంగా మీరు కోర్టుకెళితే మీకు నష్టం చేయడానికి ప్రస్తుతం ఉన్న వీలునామాని మార్చి ఇంకోవిధంగా రాయవచ్చు. తను బ్రతికి ఉండగా ఎన్నిసార్లయినా 'వీలు' రాయవచ్చు. రద్దు చేసుకోవచ్చు. కాని చివరి వీలునామాకే ప్రాధాన్యత ఉంటుంది. వీలునామా రాసినా వారి తదనంతరమే అది ఆమోదించబడుతుంది. ఆ ఆస్థికూడా మీ తాతగారి నాన్నగారికి అంబారం ద్వారా వచ్చిందన్నారు. మీ తాతగారి తండ్రి పేరిట ఆస్తి గతంలో వున్నట్లు మీరు రుజువు చేయగలిగితే అది పిత్రార్జితమవుతుంది. దాంట్లో మనవడిగా మీ నాన్నగారికి హక్కు ఉంటుంది. మీ తాతగారు కొన్న ఆస్తిలో తన ఇష్టప్రకారం చేసుకోవచ్చు. దాంట్లో మీ నాన్నగారికి ఏ హక్కు ఉండదు. మీరు మీ తాతగారిని ఒప్పించగలిగితేనే "సెటిల్‌మెంట్ డీడ్" ద్వారా వాటాలు పంపిణీ చేయించుకోగలిగితే అలా రాయించుకోండి. కాని తన స్వార్జితం రెండెకరాలు తన ఇష్టం వచ్చినట్టు చేసుకునే హక్కు మీ తాతగారికి ఉంటుంది.

- గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

రుచి

శాండ్‌విచ్ బ్రెడ్ పకోడా

కావలసిన వస్తువులు:

బంగాళా దుంపలు : నాలుగు

తెల్ల నువ్వులు : ఒక టేబుల్ స్పూన్

ఉల్లిపాయ : ఒకటి

అల్లం, పచ్చి మిరపకాయ పేస్టు : అర టేబుల్ స్పూన్

బ్రెడ్ :ఎనిమిది ముక్కలు (శాండ్‌విచ్ బ్రెడ్)

శనగపిండి: ఒకటిన్నర కప్పు

ఉప్పు : తగినంత

తయారు చేసే విధానం:

ముందుగా బంగాళా దుంపలను ఉడికించి మెత్తగా చేయాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయను, అల్లం, పచ్చిమిరపకాయ పేస్టును, నువ్వులను, తగినంత ఉప్పును కలిపి పక్కన పెట్టుకోవాలి. నువ్వులకు బదులు వాము అయినా వేసుకోవచ్చు. శనగ పిండిలో కొంచెం ఉప్పు వేసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ఒక్కో బ్రెడ్ ముక్కను రెండుగా కట్ చేసుకోవాలి. ఒక ముక్క మీద పైన తయారు చేసి పెట్టుకున్న బంగాళా దుంప మిశ్రమాన్ని నింపి రెండో ముక్కను దానిపై ఉంచి కొంచెం నొక్కి శనగపిండిలో ముంచి పకోడీల మాదిరిగా వేయించాలి. వీటిని అల్లం పచ్చడితో గాని, టమాటా సాస్‌తో గాని తినవచ్చు.

హెర్బల్ టీ

కావలసిన వస్తువులు:

నీరు : ఒకటిన్నర కప్పు

తులసి ఆకులు : ఐదారు

టీ పొడి : ఒక టేబుల్ స్పూన్

పాలు : ఒక కప్పు

పంచదార : రెండు స్పూన్లు

తయారు చేసే విధానం:

నీళ్ళు మరుగుతున్నప్పుడు తులసి ఆకులను, టీ పొడిని, పంచదారను వేయాలి. టీ డికాకన్ తయారు

కమ్మటి సువాసనలు వెదజల్లే హెర్బల్ టీ రెడీ. ఇదే రకంగా అల్లం టీ కూడా తయారు చేసుకోవచ్చు. ఎప్పుడూ ఒకే రకం కాకుండా వెరైటీ కోసం ఇలా

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

Cyan